VELTHURU TELUGU DAILY
# వెలుతురు
## తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
ఆదివారం 03.05.2026
సంపుటి: 07 సంచిక: 328
పేజీలు: 12 వెల: రూ. 5/
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH
Velthuru Newspaper


తెలంగాణ నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.

# మే 4వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం

- మే 4వ తేదీ సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించబడుతుంది
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుంది
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమావేశం నిర్వహణ



# మేము సముద్రపు దొంగలమే.. కానీ ఆటలు ఆడటం లేదు

- - ట్రంప్ సంచలన వ్యాఖ్యలు.. ఇరాన్‌కు రూ.45 వేల కోట్ల నష్టం!
- ఇదొక లాభదాయక వ్యాపారమన్న డొనాల్డ్ ట్రంప్
- అమెరికా ముట్టడితో ఇరాన్ కోట్ల చమురు ఆదాయం గండి
- హర్మూజ్ జలసంధిపై అమెరికా నౌకాదళం పూర్తి నియంత్రణ
- ఇరాన్ నేతలపై అమెరికా ఆర్థిక మంత్రి ఘాటు విమర్శలు
- ఇరాన్ నుండి ఉగ్రవాద సంస్థలకు అందే నిధుల సరఫరా నిలిపివేత
- బాలికలపై వేధింపులకు పాల్పడే ట్రంప్ ఓడిపోయారన్న ఇరాన్
- ఏప్రిల్ 13 నుండి ఇరాన్ ఓడరేవులను దిగ్బంధించిన అమెరికా దళాలు ఆగ్రహం
- ముట్టడి ప్రభావంతో భారత్ సహా ఆసియా దేశాల్లో ఇంధన భద్రతపై ఆందోళన అమెరికా దళాలు ఆగ్రహం



అమెరికా వెలుతురు మే 02:

అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము ఒక రకంగా 'సముద్రపు దొంగల' (పైరేట్స్) లాంటి వాళ్లమేనని, అయితే తాము వెనకాముందు ఆలోచించకుండా పని పూర్తి చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. గల్ఫ్ జలాల్లో ఇరాన్‌కు చెందిన చమురు నౌకను అమెరికా నౌకాదళం సీజ్ చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫ్లోరిడాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చమురు నౌకను సీజ్ చేయడం తమకు దక్కిన అతిపెద్ద లాభదాయక వ్యాపారమని అభివర్ణించారు. ..మిగతా 2లో



# బెంగాల్ కౌంటింగ్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు

- టీఎంసీకి చుక్కెదురు.. ఈసీ నిర్ణయం సరైనదేనని వెల్లడి
- కౌంటింగ్‌లో కేంద్ర సిబ్బంది నియామకాన్ని సమర్థించిన సుప్రీం
- టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం
- కేంద్ర ప్రభుత్వ పూల్ నుంచే సిబ్బందిని ఎంచుకునే అధికారం ఈసీకి ఉందని వెల్లడి
- రిటర్నింగ్ అధికారి రాష్ట్ర ఉద్యోగే.. కాబట్టి అనుమానాలు వద్దని సూచనభారం

పశ్చిమ బెంగాల్ వెలుతురు మే 02:

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి అత్యున్నత న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులనే నియమించాలన్న ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈసీ నిర్ణయం నిబంధనలకు అనుగుణంగానే ఉందని, ఇందులో ఎటువంటి చట్టవిరుద్ధత ..మిగతా 2లో



# సర్వోదయ తెలంగాణే లక్ష్యం
# 'తెలంగాణ రక్షణ సేన'పై కీలక వ్యాఖ్యలు

- కల్వకుంట్ల కవిత వెల్లడి
- 'పాంచజన్యం'తో కవిత సమరశంఖం
- ఐదు కీలక ప్రాధాన్యత అంశాల వెల్లడి
- యథావిధిగా 'తెలంగాణ జాగృతి' సేవా కార్యక్రమాలు
- ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివేవారికీ 'ఉచిత విద్య'
- క్యాన్సర్ వంటి వ్యాధులకు పూర్తిస్థాయి ప్రభుత్వ వైద్యం
- రైతు ప్రాణాలకు విలువిచ్చేలా పాలనకు హామీ ...

హైదరాబాద్ వెలుతురు మే 02:

తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త రాజకీయ శక్తి ఉద్భవించింది. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ వేదిక 'తెలంగాణ రక్షణ సేన' పేరును అధికారికంగా వెల్లడించారు. అన్ని అడ్డంకులను అధిగమించి, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఈ పార్టీని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. 'సర్వోదయ తెలంగాణ' నిర్మాణమే లక్ష్యమని, అమ్మలాంటి పాలన అందిస్తామని కవిత ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.
పాంచజన్యం: ఐదు సూత్రాల ప్రణాళిక
తెలంగాణ రక్షణ సేన తన రాజకీయ ప్రస్థానాన్ని ఐదు ప్రధాన స్తంభాలపై నిర్మించనుందని కవిత స్పష్టం చేశారు. దీనికి ఆమె 'పాంచజన్యం' అని నామకరణం చేశారు. ప్రస్తుతం ప్రజల ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని, దీనివల్ల సామాన్యుడికి పొదుపు అన్నదే లేకుండా పోయిందని ..మిగతా 2లో




# "సేవే పరమ ధర్మం" స్ఫూర్తితో వైద్యులు సేవలందించాలి

వారి త్యాగం, మార్గదర్శకత్వం

- శివ ప్రతాప్ శుక్లా: వైద్య వృత్తి పవిత్ర సేవగా చూడాలి
- ఉస్మానియా మెడికల్ కాలేజ్ 175వ స్నాతకోత్సవంలో ప్రసంగం
- సాంకేతికతతో పాటు కరుణ, నైతిక విలువలు అవసరం
- రోగి నమ్మకాన్ని కాపాడటం వైద్యుడి అత్యంత ముఖ్య బాధ్యత



## ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం వంద రోజుల్లో రూ.6 వేల కోట్ల నిధులు



# తెలంగాణలో మందు బాబులకు షాక్

- తెలంగాణలో మందు బాబులకు షాక్
- సాధారణ బ్రాండ్స్ ఫుల్ బాటిల్‌పై రూ.60.. ప్రీమియం బ్రాండ్ ఫుల్ బాటిల్‌పై రూ.100.. ఆ పై కేటగిరి బ్రాండ్
- ఫుల్ బాటిల్‌పై రూ.120 ధర పెంచే యోచన
- ఈ నెలలోనే లిక్కర్ ధరలు పెంచే అవకాశం
- ప్రతి నెల రూ.250 కోట్ల అదనపు ఆదాయం వచ్చేలా ధరలు పెంచేందుకు సిద్ధమైన ప్రభుత్వం..



## "యువతే దేశ భవిష్యత్ వారికి ఉపాధి కల్పించడమే మా లక్ష్యం"

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
నల్లగొండలో మెగా జాబ్ మేళాను ప్రారంభించిన మంత్రి



## ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ విధులు నిర్వహించండి: డిజిపి సి.వి ఆనంద్

- ఔటర్ రింగ్ రోడ్ ప్రమాదాలపై సీఎం ఎ. రేవంత్ రెడ్డి ఆందోళన
- డిజిపి సి.వి. ఆనంద్ ట్రాఫిక్ అధికారులతో సమీక్ష
- వేగ నియంత్రణ, కఠిన ట్రాఫిక్ నిబంధనల అమలు సూచనలు

## గత పాలకుల అండతోనే నెయ్యి కుంభకోణం

- శ్రీవారి లడ్డూ 'కల్తీ'కి అధికారులే కారణం
- దినేష్ కుమార్ కమిషన్ సంచలన నివేదిక
- సంస్థాగత లోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై కీలక వ్యాఖ్యలు



# రోడ్డు ప్రమాదాల నివారణకు సరికొత్త ప్లాన్

- ఘటనా స్థలాల్లో ధ్వంసమైన వాహనాల ప్రదర్శన
- మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు
- డ్రైవర్లను హెచ్చరించేలా చర్యలు
- పోలీసు శాఖ సమన్వయంతో ఏర్పాట్లు
- అవగాహన పెంచి ప్రాణనష్టం తగ్గించడమే లక్ష్యం







## హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌పై హరీష్ రావు ఆరోపణలు

- గ్రామీణ రహదారుల అభివృద్ధిని జీర్ణించుకోలేకే అసత్య ఆరోపణలు చేస్తున్నారు
- హరీష్ రావు ఆరోపణలను ఖండించిన మంత్రి సీతక్క

# సర్వోదయ తెలంగాణే లక్ష్యం

**(మొదటి పేజీ తరువాయి)**

ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడుల్లోనే కాకుండా, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుకునే వారికి కూడా ఉచిత విద్య అందించేందుకు తాము పక్కా లెక్కలతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైద్యం విషయంలో కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లలేక పేదలు ప్రాణాలు వదులుతున్నారని, తమ ప్రభుత్వం వచ్చాక ఎంత ఖరీదైన వైద్యమైనా ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారు.

అన్నదాతకు ఆత్మగౌరవం.. యువతకు ఉపాధి

రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని కవిత విమర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయడం, ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. రైస్ ఎగుమతి చేసే అవకాశాలున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల రైతులకు నష్టం జరుగుతోందని ఆరోపించారు. ఇక యువతకు సంబంధించి తన విజన్ ఏంటో కవిత వివరించారు. 25 45 ఏళ్ల మధ్య వయసున్న యువతకు వారి ఆలోచనలను బట్టి రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు అందించి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువత ఉద్యోగాలు వెతికేవారు కాకుండా, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు తెలంగాణ గడ్డపై పుట్టాలన్నదే తన ఆకాంక్ష అని వెల్లడించారు.

సామాజిక న్యాయం.. సీనియర్లకు చేయూత

వయసు మళ్లిన వారి సమస్యలను పరిష్కరించేందుకు దేశంలోనే తొలిసారిగా సీనియర్ సిటిజన్స్ కోసం ఒక ప్రత్యేక శాఖను ఏర్పాటు చేస్తామని కవిత ప్రకటించారు. పదవీ విరమణ చేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వని పరిస్థితి ఉందని, అలాంటి వారందరికీ ప్రభుత్వం తోడుగా ఉంటుందన్నారు. అలాగే అగ్రవర్ణాల్లోని పేదలు, వికలాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ సైనికులు.. ఇలా ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టించి ఇవ్వడం తమ బాధ్యత ని చెప్పారు.

అమ్మలాంటి పాలనే మా లక్ష్యం

తెలంగాణ రక్షణ సేన కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని, అది ప్రతి తెలంగాణ బిడ్డకు రక్షణ కవచం అని కవిత పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన పోరాడుతామని చెప్పారు. ఒక తల్లి తన పిల్లలను ఏ విధంగానైతే కళ్లల్లో పెట్టుకుని చూసుకుంటుందో, అదే విధంగా తెలంగాణ ప్రజలకు 'అమ్మ' లాంటి పాలన అందిస్తామని ఆమె ఉద్ఘాటించారు. 20 ఏళ్లుగా ప్రజల మధ్యే ఉన్న తెలంగాణ జాగృతి తన సేవా కార్యక్రమాలను యథావిధిగా కొనసాగిస్తుందని, రాజకీయ వేదికగా టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) అప్రతిహతంగా ముందుకు సాగుతుందని కవిత వెల్లడించారు. ఈ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా హీట్ పెరిగింది.

# బెంగాల్ కౌంటింగ్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు

**(మొదటి పేజీ తరువాయి)**

లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. మే 4న కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఈ తీర్పు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

న్యాయస్థానంలో సాగిన వాదోపవాదాలు

కౌంటింగ్ కేంద్రాల్లో సూపర్ వైజర్లుగా, అసిస్టెంట్లుగా కేంద్ర ప్రభుత్వ సిబ్బందిని లేదా ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగులను నియమించడం వల్ల వారు బీజేపీకి అనుకూలంగా వ్యవహరించే ప్రమాదం ఉందని టీఎంసీ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర సిబ్బందిని కూడా లెక్కింపు ప్రక్రియలో చేర్చుకోవాలని కోరింది. అయితే, దీనిపై ఎన్నికల సంఘం తరపు న్యాయవాదులు దీటుగా స్పందించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తానికి రిటర్నింగ్ అధికారి పర్యవేక్షకుడిగా ఉంటారని, ఆయన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగేనని గుర్తుచేశారు. ఏ విభాగం నుంచి సిబ్బందిని తీసుకోవాలనేది ఈసీ విచక్షణ అధికారమని, దీన్ని తప్పుబట్టలేమని వాదించారు. ఈ వాదనతో ఏకీభవించిన సుప్రీంకోర్టు, టీఎంసీ అభ్యంతరాలను తోసిపుచ్చింది.

ఏజెంట్లు ఉండగా ఆందోళన దేనికి?

ఓట్ల లెక్కింపు సమయంలో ప్రతి అభ్యర్థికి సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్లు అక్కడే ఉంటారని న్యాయస్థానం అభిప్రాయపడింది. ప్రతి టేబుల్ వద్ద పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే లెక్కింపు జరుగుతుంది కాబట్టి, ఎటువంటి అక్రమాలకు అవకాశం ఉండదని పేర్కొంది. ఈ విషయంలో గతంలో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ నిర్ణయం పట్ల బీజేపీ హర్షం వ్యక్తం చేయగా, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై తమకు నమ్మకం ఉందని స్పష్టం చేసింది.

మే 4న ఫలితాల జాతర

మరోవైపు పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల వేడి క్లైమాక్స్‌కు చేరుకుంది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గానూ ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ పూర్తయింది. అయితే కొన్ని ప్రాంతాల్లో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో మగ్రాహాట్ పశ్చిమ్, డైమండ్ హార్బర్ నియోజకవర్గాల్లోని మొత్తం 15 పోలింగ్ కేంద్రాల్లో ఈసీ రీపోలింగ్ నిర్వహించింది. ఈ ప్రక్రియ ముగియడంతో ఇక అందరి కళ్లు మే 4న జరగనున్న కౌంటింగ్‌పైనే ఉన్నాయి. అధికారం దక్కించుకోవాలని తృణమూల్, పాగా వేయాలని బీజేపీ తీవ్రంగా శ్రమిస్తున్న తరుణంలో వెలువడనున్న ఫలితాలు దేశవ్యాప్తంగా ఆసక్తిని కలిగిస్తున్నాయి.

భారత్‌లోని ఇరాన్ సుప్రీం నేత డిప్యూటీ ప్రతినిధి మొహమ్మద్ హుస్సేన్ జియాయీనియా కూడా ఏప్రిల్ 28న ఇదే విషయాన్ని ధృవీకరించారు. ఖమేనీ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని, ఆయన క్షేమంగా ఉన్నారనే సమాచారం తమకు అందిందని ఏఎన్ఐ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వస్తున్న పుకార్లకు చెక్ పెట్టేలా ఇరాన్ రాయబార కార్యాలయాలు ఈ సమాచారాన్ని ప్రపంచవ్యాప్తంగా చేరవేస్తున్నాయి.

**తీవ్ర ఆంక్షల మధ్య చికిత్స**

గత ఫిబ్రవరిలో ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ నివాసంపై జరిగిన వైమానిక దాడుల్లో ఆయన మరణించగా, అదే సమయంలో మొజ్తబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారని న్యూయార్క్ టైమ్స్ వంటి అంతర్జాతీయ పత్రికలు కథనాలు ఇచ్చాయి. ఆ దాడిలో ఆయన భార్య, కుమారుడు కూడా ప్రాణాలు కోల్పోయారని సమాచారం. అప్పటి నుంచి ఆయనను కలిసేందుకు భద్రతా బలగాలు కఠిన ఆంక్షలు విధించాయి. కేవలం అత్యంత విశ్వసనీయమైన వైద్య సిబ్బంది మాత్రమే ఆయనకు సేవలు అందిస్తున్నారని, భద్రతా కారణాల దృష్ట్యా ఆయనను బయటి ప్రపంచానికి దూరంగా ఉంచినట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి పరిస్థితి మొత్తం ఖమేనీ అదుపులోనే ఉందని, త్వరలోనే ఆయన ప్రజల ముందుకు వచ్చే అవకాశం ఉందని ఇరాన్ అధికార వర్గాలు సంకేతాలిస్తున్నాయి. పశ్చిమ దేశాల ప్రచారాన్ని తిప్పికొడుతూ ఇరాన్ ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు టెహ్రాన్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది.



# మేము సముద్రపు దొంగలమే.. కానీ ఆటలు ఆడటం లేదు

**(మొదటి పేజీ తరువాయి)**

సూచించారు. ఒకవేళ యూనియన్ల మధ్య ఏకాఇరాన్ ఆర్థిక వ్యవస్థపై అమెరికా ఉక్కుపాదం

అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) గణాంకాల ప్రకారం.. ఇరాన్‌పై అమెరికా విధిస్తున్న ఆర్థిక, సైనిక ఒత్తిడి ఆ దేశాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తోంది. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మార్గంలో అమెరికా నౌకాదళం మోహరించడంతో ఇరాన్ చమురు ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. దీనివల్ల ఇప్పటివరకు ఇరాన్ దాదాపు 4.8 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 45 వేల కోట్లు) ఆదాయాన్ని కోల్పోయిందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధించడం ద్వారా ఆ దేశం నుంచి అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలకు అందుతున్న నిధులను అడ్డుకోగలిగామని పెంటగాన్ అధికార ప్రతినిధి సీన్ పార్నెల్ స్పష్టం చేశారు

మురుగునీటి పైపులోని ఎలుకల్లా ఇరాన్ నేతలు

ఇదే సమయంలో అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఇరాన్ పాలకులపై చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. ఇరాన్ అగ్రనేతలు మురుగునీటి పైపుల్లో దాక్కున్న ఎలుకల్లా వ్యవహరిస్తున్నారని, బయటి ప్రపంచం ఏవిధంగా మారుతుందో కూడా తెలియని స్థితిలో వారు ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ఇరాన్ కరెన్సీ విలువ దారుణంగా పడిపోయిందని, ఆ దేశంలో ఆహారం, గ్యాసోలిన్ కొరత తీవ్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 27 నాటి పరిస్థితులు మళ్లీ నెలకొనే వరకు, అంటే నౌకల స్వేచ్ఛాయుత రవాణా పునరుద్ధరించబడే వరకు ఇరాన్ ముట్టడి కొనసాగుతుందని ఆయన తేల్చి చెప్పారు.

ఇరాన్ తీవ్ర నిరసన.. యుద్ధ క్షేత్రంలో ఓడిపోయారంటూ ఎద్దేవా

అమెరికా నేతల వ్యాఖ్యలపై ఇరాన్ రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించింది. యుద్ధ క్షేత్రంలోనూ, సైబర్ విభాగంలోనూ అమెరికా ఇప్పటికే ఇరాన్ చేతిలో ఓడిపోయిందని, ఆ బాధలోనే ట్రంప్ మరియు ఆయన మంత్రులు ఇలాంటి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని మండిపడింది. డొనాల్డ్ ట్రంప్‌ను 'మూర్ఖుడి'గా సంబోధిస్తూ.. గెలిచిన వారు ఎప్పుడూ ఇలాంటి అసభ్యకర భాష వాడరని ఇరాన్ విమర్శించింది. బాలికలపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్న వ్యక్తి నుంచి తాము నీతులు వినాల్సిన అవసరం లేదని ఘాటుగా కౌంటర్ ఇచ్చింది

ఆసియా దేశాలపై ప్రభావం

పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలం కావడంతో ఏప్రిల్ 13 నుంచి అమెరికా ఈ ముట్టడిని తీవ్రతరం చేసింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఈ ఉద్రిక్తతల వల్ల హర్మూజ్ జలసంధి గుండా వాణిజ్య నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ పరిణామం కేవలం ఇరాన్‌కే కాకుండా భారత్ సహా అనేక ఆసియా దేశాల ఇంధన భద్రతపై ప్రభావం చూపుతోంది. చమురు సరఫరాలో అంతరాయం కలగడం వల్ల రానున్న రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# గత పాలకుల అండతోనే నెయ్యి కుంభకోణం

- **- ప్రైవేటు డెయిరీలకు లాభం చేకూర్చేలా టెండర్ నిబంధనల సడలింపు**
- **- అనుభవం లేని నకిలీ డెయిరీల రంగప్రవేశం - కమిషన్ గుర్తింపు**
- **- తక్కువ ధరకే బిడ్లు.. నాణ్యతను గాలికొదిలేసిన అప్పటి టీటీడీ బోర్డు**
- **- నకిలీ ఉత్పత్తి సామర్థ్య సర్టిఫికెట్లతో టీటీడీని మోసం చేసిన సంస్థలు**
- **- కల్తీ అని ల్యాబ్ రిపోర్టులు వచ్చినా ఆగని కొనుగోళ్లు - అధికారుల బాగోతం**
- **- పరీక్షలు లేకుండానే 70 లక్షల కిలోల నెయ్యి సరఫరా - భక్తుల ఆరోగ్యంతో చెలగాటం**
- **- నిర్ణయాధికారంలో కొందరికే పెద్దపీట.. పారదర్శకతకు పాతర**

**తిరుపతి వెలుతురు మే 02:**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లో గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నెయ్యి కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగినట్లు ఏకసభ్య కమిషన్ నిర్ధారించింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలోని కమిషన్ ఈ కుంభకోణంపై లోతైన విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అప్పటి అధికారులు, పాలక మండలి ఉద్దేశపూర్వకంగానే నిబంధనలను సడలించి, నాసిరకం నెయ్యిని సరఫరా చేసే సంస్థలకు కొమ్ముకాచారని కమిషన్ తన నివేదికలో ఎండగట్టింది. కోట్లాది మంది భక్తుల విశ్వాసాలతో ముడిపడి ఉన్న శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను ఈ కల్తీ వ్యవహారం తీవ్రంగా దెబ్బతీసిందని కమిషన్ ఆవేదన వ్యక్తం చేసింది.

నిబంధనల నీరుగార్పు ఒక ప్రణాళికాబద్ధమైన కుట్ర

నెయ్యి కొనుగోలు నిబంధనలను పటిష్టం చేసేందుకు 2019 ఆగస్టులో కొన్ని మార్పులు చేసినప్పటికీ, వాటిని కేవలం ఐదు నెలల కాలంలోనే మళ్లీ సడలించారని కమిషన్ వెల్లడించింది. టెండర్లలో ఎక్కువ మంది పాల్గొనాలనే సాకుతో అనుభవం, టర్నోవర్ వంటి కీలక నిబంధనలను తొలగించారు. ఈ మార్పుల వల్ల అర్హత లేని భోలేబాబా, ఏఆర్ డెయిరీ వంటి సంస్థలు తక్కువ ధరకే బిడ్లు వేసే అవకాశం దక్కింది. మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు ఆవు నెయ్యి సరఫరా చేయడం అసాధ్యమని తెలిసి కూడా, అధికారులు ఆ బిడ్లను ఎలా ఆమోదించారని కమిషన్ ప్రశ్నించింది. సహకార డెయిరీలను పక్కనపెట్టి ప్రైవేటు సంస్థలకు ద్వారాలు తెరవడమే నాణ్యత పడిపోవడానికి తొలి మెట్టు అని కమిషన్ తేల్చింది.

నకిలీ పత్రాలు.. గుడ్డిగా ఆమోదించిన కమిటీలు

టెండర్లలో పాల్గొన్న డెయిరీలు సమర్పించిన ఉత్పత్తి సామర్థ్య పత్రాలు పూర్తిగా తప్పు అని తేలింది. ఏడాదికి కనీసం 2,160 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం ఉండాలనే నిబంధనను పక్కనపెట్టి, కేవలం 56 టన్నుల సామర్థ్యం ఉన్న సంస్థలకు కూడా ఆర్డర్లు ఇచ్చారు. మరికొన్ని డెయిరీలు నకిలీ ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్లను సమర్పించినా, తనిఖీ కమిటీలు వాటిని గుడ్డిగా ఆమోదించాయని దినేష్ కుమార్ కమిషన్ నిగ్గుతేల్చింది. నిబంధనల ప్రకారం ప్లాంట్లను సందర్శించి నివేదిక ఇవ్వాల్సిన అధికారులు, ఏసీ గదుల్లో కూర్చునే సరఫరాదారులకు అనుకూలంగా నివేదికలు సిద్ధం చేశారని కమిషన్ ఆరోపించింది.

నివేదికలను తొక్కిపెట్టిన వైనం

మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కొన్ని డెయిరీల నెయ్యి కల్తీదని 2022లోనే నివేదిక ఇచ్చింది. భోలేబాబా వంటి సంస్థలు సరఫరా చేస్తున్న నెయ్యి ప్రమాణాలకు అనుగుణంగా లేదని తెలిసినా, అప్పటి టీటీడీ ఉన్నతాధికారులు ఆ నివేదికను ఉద్దేశపూర్వకంగానే తొక్కిపెట్టారు. కల్తీ చేసిన సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టాల్సింది పోయి, వాటికి అదనంగా 15 శాతం ఆర్డర్లు ఇవ్వడం అధికారుల అవినీతికి పరాకాష్ట అని కమిషన్ మండిపడింది. టెండర్ ఖరారైన తర్వాత ధరలపై సంప్రదింపులకు అవకాశం లేకపోయినా, ఈమెయిల్స్ ద్వారా వచ్చిన ప్రతిపాదనలను ఆమోదించి సంస్థలకు లబ్ధి చేకూర్చారు.

పరీక్షలు లేకుండానే నెయ్యి వినియోగం

ఆహార భద్రత ప్రమాణాల ప్రకారం 2022 నుంచి 'బీటా సిస్టోస్టెరాల్' పరీక్షను తప్పనిసరి చేశారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందో లేదో తెలుసుకోవడానికి ఇది అత్యంత కీలకమైన పరీక్ష. అయితే, సరఫరాదారుల విన్నపం మేరకు అప్పటి టీటీడీ యాజమాన్యం ఈ పరీక్ష నుంచి వారికి మినహాయింపు ఇచ్చింది. దీనివల్ల సుమారు 70.78 లక్షల కిలోల నెయ్యి ఎటువంటి నాణ్యతా పరీక్షలు లేకుండానే నేరుగా శ్రీవారి పోటుకు చేరిందని కమిషన్ సంచలన విషయాన్ని బయటపెట్టింది. టీటీడీ ల్యాబ్‌ను అప్‌గ్రేడ్ చేయడంలో కూడా ఉద్దేశపూర్వక జాప్యం చేశారని, దీని వెనుక పెద్ద ఎత్తున ఆర్థిక లావాదేవీలు ఉండవచ్చని కమిషన్ తన నివేదికలో అనుమానం వ్యక్తం చేసింది. ఈ కుంభకోణానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది..



ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ విధులు నిర్వహించండి: డిజిపి సి.వి ఆనంద్

- **ఎ. రేవంత్ రెడ్డి: ఔటర్ రింగ్ రోడ్ ప్రమాదాలపై ఆందోళన, తక్షణ చర్యల ఆదేశం**
- **సి.వి. ఆనంద్ ట్రాఫిక్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహణ**
- **వాహనాల వేగ నియంత్రణ, భద్రతా ప్రమాణాలపై రాజీ లేకుండా అమలు సూచనలు**
- **ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు కొత్త వ్యూహాలు, త్వరలో రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు**
- **డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీట్ బెల్ట్ నిబంధనలపై కఠిన చర్యలు**

హైదరాబాద్, వెలుతురు మే 02:

ఔటర్ రింగ్ రోడ్డు పై ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస ప్రమాదాల పట్ల ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారని, ఈ ప్రమాదాల నివారణకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించిన నేపథ్యంలో, రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ సి వి ఆనంద్ శనివారం నాడు ట్రాఫిక్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వాహనాల వేగాన్ని కచ్చితంగా నియంత్రించడంతో పాటు, భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి రాజీ పడకూడదని అధికారులకు డిజిపి స్పష్టం చేశారు. ముఖ్యంగా నగరంలో వాహనదారులకు, సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్లు, డీసీపీలతో నిర్వహించిన ఈ సమావేశంలో నగరంలో నెలకొన్న ట్రాఫిక్ పరిస్థితులపై డిజిపి సివి ఆనంద్ కూలంకషంగా సమీక్షించారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు సరికొత్త వ్యూహాలను అవలంబించాలని, అవసరమైన చోట పటిష్టమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే 'ట్రాఫిక్ మేనేజ్మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో'ను ఏర్పాటు చేయనుందని, దీనికి సంబంధించిన కసరత్తు జరుగుతోందని ఆయన వెల్లడించారు. ఈ బ్యూరో అతి త్వరలోనే అందుబాటులోకి వచ్చి ట్రాఫిక్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తుందని డిజిపి ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపాలని, ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను , హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వారి పైన చట్టం ప్రకారం వ్యవహరించాలని, నిబంధనల అమలుపై క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ చందన దీప్తితో పాటు ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెగ్డే, కాజల్ సింగ్, రాహుల్ రెడ్డి, అవినాష్ కుమార్, శేషాద్రిని రెడ్డి, శ్రీనివాస్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# "యువతే దేశ భవిష్యత్ వారికి ఉపాధి కల్పించడమే మా లక్ష్యం"

- **"నల్లగొండ యువతకు స్థానికంగానే ఉద్యోగాలు కల్పిస్తాం"**
- **సుమారు 124 కంపెనీలు జాబ్ మేళా**
- **"5000 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని కంపెనీలకు స్పష్టమైన సూచనలు ఇచ్చాం"**
- **"సేఫ్టీ నిబంధనలు పాటించని కంపెనీలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలము"**
- **"ఏ పని చిన్నది కాదు... ఉద్యోగం చేస్తూనే ఉన్నత స్థాయికి ఎదగాలి"**
- **"ప్రతి యువకుడు అవకాశం పట్టుకుని ముందుకు రావాలి... ఇదే సరైన సమయం"**

నల్లగొండ వెలుతురు మే 02:

నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని "న్యాక్" (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్) లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. అనంతరం నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య అతిపెద్ద సమస్యగా ఉందని, అయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చదివిన చదువుకు ఉద్యోగం ఇచ్చే విధంగా కార్యచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని, అందులో భాగంగా అన్ని జిల్లాలలో మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా ద్వారా 5000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి అపాయింట్మెంట్ ఆర్డర్ ఇవ్వాలని ఆయన కంపెనీలతో కోరారు. యువత పెద్ద ఎత్తున జాబ్ మేళాకు వస్తున్నందున ఆదివారం కూడా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా సిమెంటు కంపెనీలు, రైస్ ఇండస్ట్రీస్, ఫార్మా తదితర అనేక కంపెనీలు ఉన్నాయని, అందువల్ల స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగం తో పాటు, కంపెనీలపై కూడా ఉందని అన్నారు. నిరుద్యోగ యువత ఎలాంటి ఉద్యోగం వచ్చినా ముందుగా చేరాలని, అనవసరంగా సమయం వృధా చేసుకోవద్దని ,ఉద్యోగం చేస్తూ ఉన్నత ఉద్యోగాల కోసం చదువుకోవాలని, ప్రత్యేకించి గ్రూపు ఇతర ఉద్యోగాలకు చదువుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎంఎస్ఎం ఈ కింద పరిశ్రమలు స్థాపించేందుకు అవకాశం ఉందని, దీని ద్వారా కూడా స్వయం ఉపాధి పొందవచ్చని అన్నారు. గతంలో తన హయాంలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా 18,400 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. నల్గొండ జిల్లా లోని న్యాక్ సంస్థ అతిపెద్దదని, దీని ద్వారా అనేక వృత్తులలో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు .పట్టణంలో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యం అన్ని కల్పించామని అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలలో అనేక మంది చనిపోతున్నారని రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు భద్రతను చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆయన జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల జిల్లాలో ఫార్మా కంపెనీలో సంభవించిన ప్రమాదాల పై మాట్లాడుతూ అన్ని కంపెనీలు భద్రత చర్యలను తప్పకుండా పాటించాలని చెప్పారు . నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.



జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళాలో నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 124 కంపెనీలు జాబ్ మేళాలో ఉద్యోగాలు ఇచ్చేందుకు రావడం జరిగిందని, ఇందులో ఐటి, బ్యాంకింగ్ ,కంప్యూటర్ ,బిజినెస్ సర్వీస్ వంటి రంగాలలో ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. కంపెనీలు వారి వద్ద ఉన్న అన్ని ఖాళీలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం రావడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితి మారుతుందని, ఇది మంచి అవకాశం అని అన్నారు.

డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి తదితరులు మాట్లాడారు.

స్థానిక సంస్థల ఇంచార్జ్ కలెక్టర్ వై. అశోక్ రెడ్డి డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్ ,జిల్లా క్రీడలు, యువజన సర్వీసులు అభివృద్ధిలో శాఖ అధికారి అక్బర్ ఆలీ, పరిశ్రమల శాఖ జిఎం సతీష్, న్యాక్ అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వేసవి విందు ఈతపళ్ళు : రుచికి రుచి.. ఆరోగ్యానికి మేలు!



హైదరాబాద్ వెలుతురు మే 2:

వేసవి కాలం వచ్చిందంటే చాలు పల్లెటూళ్లలో కనువిందు చేసే ప్రకృతి ప్రసాదం ఈతపళ్ళు. కాషాయం మరియు ఎరుపు రంగు కలగలుపుతో ఆకర్షణీయంగా కనిపించే ఈ పళ్ళు కేవలం రుచికే కాకుండా, అద్భుతమైన పోషక విలువలకు నిలయం. వీటిలో సమృద్ధిగా ఉండే క్యాల్షియం ఎముకలను దృఢంగా ఉంచడమే కాకుండా, ఐరన్ శాతం వల్ల రక్తహీనత (ఎనీమియా) సమస్యను దూరం చేసి రక్తవృద్ధికి తోడ్పడుతుంది. కేవలం పండుగానే కాకుండా, వీటితో తాండ్రను తయారు చేస్తారు. బెంగాల్ వంటి ప్రాంతాల్లో ఈత చెట్ల నుండి బెల్లాన్ని కూడా తయారు చేయడం విశేషం. ఈతపళ్ళలో ఉండే గ్లూకోజ్, సుక్రోజ్, ఫ్రక్టోజ్ వంటి చక్కెరలు శరీరానికి తక్షణ శక్తిని అందించి వేసవి అలసటను, నిస్సత్తువను దూరం చేస్తాయి. జీర్ణశక్తిని పెంపొందించి మలబద్ధకం, కడుపునొప్పి వంటి జీర్ణ సంబంధిత రుగ్మతలను తగ్గించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అంతేకాకుండా, శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు, అల్జీమర్స్ వంటి మెదడు సంబంధిత వ్యాధుల నివారణకు, జ్వరం, ఫ్లూ వంటి సమస్యల చికిత్సకు ఇవి ఎంతో ఉపయోగపడతాయి. ప్రకృతి సిద్ధంగా లభించే ఈ అమృతాహారాన్ని తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఈతపళ్ళ పోషక విలువలు
ప్రతి 100 గ్రాములకు :
శక్తి : 980 కిలో కేలరీలు
పిండిపదార్థాలు: 65 గ్రాములు.
చక్కెరలు: 53 గ్రాములు
పీచుపదార్థాలు: 6 గ్రాములు.
కొవ్వు పదార్థాలు: 0.4 గ్రాములు
మాంసకృత్తులు: 2.5 గ్రాములు.
నీరు: 21 గ్రాములు
విటమిన్ సి: 0.4 మిల్లీగ్రాములు

# ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు




- **టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**

హైదరాబాద్ వెలుతురు మే 02:

ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా జర్నలిస్టులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ ఒక ప్రాణాధారం అని, సమాజంలో సత్యాన్ని వెలికితీసే బాధ్యతను మీడియా నిర్వర్తిస్తోందని ఆయన పేర్కొన్నారు.
పత్రికలు, మీడియా సంస్థలు ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు లేకుండా స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.
ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తూ, ప్రభుత్వ పనితీరును సమీక్షిస్తూ, సమాజానికి దిశానిర్దేశం చేసే పాత్రలో మీడియా ఎంతో కీలకమని అన్నారు.
ఈ సందర్భంగా జర్నలిస్టులు తమ వృత్తి నిబద్ధతను కాపాడుకుంటూ నిజాయితీగా పని చేయాలని ఆకాంక్షించారు.
మీడియా స్వేచ్ఛను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడంలో మీడియా పాత్ర మరింత బలోపేతం కావాలని కోరుకున్నారు.

# హైదరాబాద్‌లోని 'ఎన్ఐఆర్‌డీ-పీఆర్' ప్రాంగణంలో 'స్వయంసమృద్ధ పంచాయతీ కార్యక్రమం'పై అవగాహన సదస్సు

- **ఈ సదస్సులో పలువురు ఉన్నతాధికారులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు సహా రాష్ట్రం నలుమూలల నుంచి 400 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు.**

వెలుతురు పిఐబీ హైదరాబాద్ 02 మే 2026:




హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) ప్రాంగణంలో 2026 మే 2న 'స్వయంసమృద్ధ పంచాయతీ కార్యక్రమం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ సహకారంతో కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ నిర్వహించిన ఈ సదస్సులో పలువురు ఉన్నతాధికారులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు సహా రాష్ట్రం నలుమూలల నుంచి 400 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో స్వీయ వనరుల ద్వారా ఆదాయం సమకూర్చుకోవడంలో విశేష ప్రతిభ కనబరిచిన 70 మంది పంచాయతీ సర్పంచులు కూడా ఉన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ వివేక్ భరద్వాజ్ ప్రధానోపన్యాసం చేశారు. 'స్వయంసమృద్ధ భారత్, వికసిత భారత్' వంటి దీర్ఘకాలిక లక్ష్యాల సాధన దిశగా 'స్వయంసమృద్ధ పంచాయతీ'ల పాత్రను, ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. క్షేత్రస్థాయి పరిపాలనకుగల పరిణామాత్మక శక్తిని ప్రస్ఫుటం చేస్తూ స్వావలంబన, సాధికారతగల పంచాయతీల తోడ్పాటుతో ఈ దార్శనికతను సాకారం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. జాతీయ రూపాంతరీకరణలో పంచాయతీలే కీలక ఉపకరణాలని, పౌరులలో చైతన్యం రగిలించడంలో అవి ఎంతగానో తోడ్పడగలవని అన్నారు. అలాగే, స్వావలంబిత సమాజాల రూపకల్పన, సుసంఘటిత సామూహిక కృషికి సారథ్యం వహించగల సామర్థ్యం వాటికున్నాయని ఆయన ఉద్ఘాటించారు. పంచాయతీల నాయకులు తమ పరిధిలో అర్థవంతమైన, శాశ్వత ప్రభావ సృష్టి దిశగా వినూత్న ఆలోచనలతో నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని కోరారు. ఒక వ్యక్తి వారసత్వమే అతని వాస్తవిక నాయకత్వ పటిమను నిర్వచిస్తుందని పేర్కొన్నారు. వృద్ధి, ప్రగతి సంబంధిత కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడంలో విస్పష్ట దృక్పథానికిగల ప్రాముఖ్యాన్ని స్పష్టం చేశారు. దేశాన్ని 2047 నాటికి వికసిత భారత్‌గా తీర్చిదిద్దగల సాధికార, పునరుత్థాన, స్వయంసమృద్ధ పంచాయతీలకు రూపమివ్వాల్సిన ఆవశ్యకతను ఆయన పునరుద్ఘాటించారు. ఈ మేరకు మార్పు దిశగా తమనుతాము వైతాళికులుగా భావించుకుంటూ ముందడుగు వేయాలని వారిని ప్రోత్సహించారు.

అనంతరం తెలంగాణ ప్రభుత్వ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం.దానకిషోర్ మాట్లాడారు. ఆర్థికంగా సాధికారత సాధించిన పంచాయతీల ద్వారానే భారత స్వావలంబన ప్రస్థానం వేగం పుంజుకోగలదని చెప్పారు. స్వీయ వనరుల ద్వారా ఆదాయం పెంచుకుంటూ, గ్రాంట్లపై పరాధీనతను తగ్గించుకోవాలని సూచించారు. అదే సమయంలో తమకందే ప్రభుత్వ నిధులను సమర్థంగా సద్వినియోగం చేసుకోవాలని ఉద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్రం గణనీయ ప్రగతి సాధించినప్పటికీ వినూత్న ఆవిష్కరణలు, వ్యూహాత్మక ప్రణాళిక, ఉత్తమ విధానాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. స్థానిక యాజమాన్యం, జవాబుదారీతనం, క్రియాశీల సామాజిక భాగస్వామ్యంతోనే సుపరిపాలన ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. అత్యుత్తమ పనితీరు కనబరిచే పంచాయతీల అనుభవం నుంచి నేర్చుకుంటూ, విజయవంతమైన నమూనాలను అనుకరించాలని సర్పంచులకు సూచించారు.
పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి ముక్తా శేఖర్, తెలంగాణ పంచాయతీ రాజ్ కమిషనర్ శ్రీమతి డి.దివ్య, హైదరాబాద్ హడ్కో లిమిటెడ్ ప్రాంతీయాధిపతి శ్రీ పి.సుభాస్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్, 'స్వయంసమృద్ధ పంచాయతీల కార్యక్రమం' నోడల్ అధికారి శ్రీ పి.జె.వెస్లీ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. సమర్థ స్థానిక పరిపాలనలో భాగంగా వినూత్న, సుస్థిర విధానాలను అనుసరించాల్సిందిగా పంచాయతీ ప్రతినిధులను కోరారు.

నాబార్డ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ గోవర్ధన్ సింగ్ రావత్ ప్రసంగిస్తూ జాతీయ పురోగమనంలో అనివార్య భాగస్వాములుగా గ్రామీణ సమాజాలను వికసిత్ భారత్ దృక్కోణం పరిగణిస్తున్నదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణ స్థానిక సంస్థల ద్వారా పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ నిరంతర కృషిని ఆయన ప్రశంసించారు. ఆర్థిక వృద్ధి, స్వావలంబన దిశగా పంచాయతీలను బలమైన చోదకశక్తులుగా రూపుదిద్దడానికి సమన్వయ సహిత సంస్థాగత కృషి అవసరమని ఆయన పిలుపునిచ్చారు.
స్వయంసమృద్ధ పంచాయత్ పోర్టల్ గురించి పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సాంకేతిక బృందం ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించింది. ఇందులో భాగంగా అప్లికేషన్ వర్క్‌ఫ్లో, డాష్‌బోర్డ్‌ల పూర్తి వివరాలను తెలుపుతూ, డిజిటల్ ఉపకరణాల సమర్థ వినియోగంపై కార్యక్రమంలో పాల్గొన్నవారికి ఆచరణాత్మక అవగాహన కల్పించింది.

# ఆర్టీసీ సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉండండి

- **అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం**
- **మే 17 లోపు బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు**
- **ప్రతి రెండో మంగళవారం అన్ని డిపోల్లో సిబ్బంది కోసం 'గ్రీవెన్స్ డే'**
- **నష్టాల్లో ఉన్న డిపోలపై ప్రత్యేక సమీక్ష.. జూన్ నాటికి పెండింగ్ షాపుల క్లియరెన్స్**


హైదరాబాద్ వెలుతురు మే 02:





తెలంగాణ ఆర్టీసీని మరింత బలోపేతం చేసే దిశగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రీజనల్ మేనేజర్లు, డిపో మేనేజర్లతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కార్మిక సంఘాల నేతలు జరిపిన భేటీలో లేవనెత్తిన అంశాలను ప్రస్తావిస్తూ, క్షేత్రస్థాయి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ఆర్టీసీ అధికారులు కిందిస్థాయి సిబ్బంది పట్ల కఠినంగా కాకుండా, సానుకూల దృక్పథంతో, స్నేహపూర్వకంగా వ్యవహరించి పనులు చేయించుకోవాలని స్పష్టం చేశారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయడం సరికాదని, అందరూ కలిసికట్టుగా పని చేసినప్పుడే సంస్థ అభివృద్ధి చెందుతుందని ఆయన హితవు పలికారు.
రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతున్న తరుణంలో, కొన్ని డిపోలు (ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, బాన్సువాడ తదితర) నష్టాల్లో ఎందుకు ఉన్నాయో సమీక్షించుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రయాణికులతో ఏవైనా సమస్యలు ఎదురైతే సిబ్బంది గొడవలకు దిగవద్దని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. "సంస్థలో ఇంటర్నల్ అటాక్ అనేది ప్రమాదకరమైన విషయం" అని వ్యాఖ్యానించిన మంత్రి, సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి రెండో మంగళవారం అన్ని డిపోల్లో గ్రీవెన్స్ డే నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సర్పంచుల నుండి ఎమ్మెల్యేల వరకు ప్రజాప్రతినిధులతో అధికారులు మంచి సంబంధాలు కలిగి ఉండాలని, జూన్ నాటికి పెండింగ్ షాపుల సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. గత సమ్మె కాలం నాటి డిమాండ్లను ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని, భవిష్యత్తులో కార్మికులకు మరింత మేలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.

పెద్దకర్మ



నాతి మల్లికార్జున రావు గారు

తేది 23-04-2026 గురువారం రోజున మా తండ్రి నాతి మల్లికార్జున రావు గారు స్వర్గస్థులైనారు అని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

తేది 03-05-2026 ఆదివారం ఉదయం 11:30 గం.లకు "పెద్దకర్మ" జరుపబడును. కావున తామెల్లరు విచ్చేసి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని మనవి చేయుచున్నాము.

కార్యస్థలం:
Kola's Grand Hotel
Opposite RTC Bus Stand Road, Warangal

ఇట్లు
కొడుకులు, కోడళ్లు : శరత్ & ప్రతిభ, రవి చందర్ & సుషుమ్న
కూతుళ్లు, అల్లుళ్లు : రాధిక & సమ్మయ్య, సుజన & అరుల్ జ్యోతి
మనమళ్లు, మనమరాళ్లు : పూజిత-విశ్వనాథ్, సాహిత్య-సచిన్, అమేయ, ఆర్యణి, సంఘమిత్ర, ఊర్జ, అమర్త్య & అక్షయ
మరియు బంధు మిత్రులు

# తెలుగు రాష్ట్రాల్లో బీసీల రాజకీయ స్థితి... ఆత్మపరిశీలన అవసరం..!

తెలుగు రాష్ట్రాల సామాజిక నిర్మాణంలో బీసీలు సంఖ్యాపరంగా అత్యధికులు అనే విషయం ఇటీవల డేటాతో మరింత స్పష్టమైంది. ఉదాహరణకు, తాజా సర్వేల ప్రకారం తెలంగాణలోనే బీసీలు సుమారు 56% పైగా ఉన్నారని వెల్లడైంది . అదే విధంగా ఆంధ్రప్రదేశ్లో కూడా బీసీలు దాదాపు సగానికి సమీపంగా ఉన్నారు . ఈ సంఖ్యలు చూస్తే బీసీలు కేవలం ఒక వర్గం కాదు, సమాజాన్ని నడిపించే ప్రధాన శక్తి అని అర్థమవుతుంది.వ్యవసాయం, చిన్నతరహా వృత్తులు, సేవారంగం,ఈ అన్ని రంగాల్లో బీసీలే వెన్నెముకగా నిలుస్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో, ముఖ్యంగా వ్యవసాయ కుటుంబాల్లో బీసీల శాతం దేశ సగటు కంటే ఎక్కువగా ఉండటం కూడా ఇదే విషయాన్ని నిరూపిస్తుంది . అంటే, ఉత్పత్తి రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్న వర్గం, రాజకీయ అధికారంలో అదే స్థాయిలో ప్రతిఫలించకపోవడం ఒక స్పష్టమైన విరోధాభాసం.

ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడింది అనే ప్రశ్నకు సమాధానం కోసం కేవలం భావోద్వేగ దృష్టికోణం సరిపోదు. చరిత్రాత్మకంగా చూసుకుంటే, విద్య, భూమి, ఆర్థిక వనరులు వంటి కీలక సాధనాలు కొద్ది వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయి. దీని వల్ల రాజకీయ అధికారానికి చేరుకునే మార్గాలు కూడా అసమానంగా మారాయి. అదే సమయంలో, బీసీ వర్గాల అంతర్గత విభజనలు,కులాల వారీగా, ప్రాంతాల వారీగా,ఒక సమిష్టి రాజకీయ శక్తిగా ఎదగడాన్ని కష్టతరం చేశాయి.

ఇక రాజకీయ వ్యవస్థలో కూడా ఒక నిర్మాణాత్మక సమస్య ఉంది. ప్రధాన రాజకీయ పార్టీలలో బీసీలకు ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ, నిర్ణయాధికార కేంద్రాలు మాత్రం పరిమిత వర్గాల చేతుల్లోనే ఉండటం వల్ల, బీసీ నాయకత్వం పూర్తి స్థాయిలో ఎదగలేకపోయింది. ఫలితంగా, జనాభా పరంగా మెజారిటీగా ఉన్న వర్గం, రాజకీయంగా మైనారిటీ స్థితిలోనే కొనసాగుతోంది. కాబట్టి ఈ విరోధాభాసాన్ని అర్థం చేసుకోవాలంటే, సంఖ్యల కంటే ఎక్కువగా, సామాజిక నిర్మాణం, చారిత్రక అసమానతలు, రాజకీయ వ్యూహాలు, అన్నిను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. అప్పుడే సమస్యకు నిజమైన పరిష్కార మార్గాలు కనబడతాయి.

స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలో ప్రజాస్వామ్యం స్థిరపడినప్పటికీ, రాజకీయ అధికారాన్ని నియంత్రించిన వర్గాలు ఎక్కువగా అగ్రవర్ణాలే. ఇది కేవలం కుట్రల ఫలితం మాత్రమే కాదు, విద్య, ఆర్థిక వనరులు, సామాజిక ప్రాధాన్యత అన్ని ముందుగానే ఆ వర్గాల చేతుల్లో ఉండటం వల్ల ఏర్పడిన సహజ పరిణామం కూడా. బీసీలు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, వారి మధ్య వృత్తి, కుల, ప్రాంతీయ విభజనలు చాలా లోతుగా ఉన్నాయి. ఈ విభజనల వల్ల వారు ఒకే రాజకీయ శక్తిగా ఎదగలేకపోయారు.

తెలుగు రాష్ట్రాల్లో బీసీలు రాజకీయంగా వెనుకబడటానికి ఒక ప్రధాన కారణం—ఏకత లేకపోవడం. ఒక కులం మరొక కులంతో కలిసిపోవడానికి ఇష్టపడకపోవడం, స్థానిక నాయకత్వంపై ఆధారపడటం, చిన్న ప్రయోజనాల కోసం పెద్ద లక్ష్యాలను వదులుకోవడం,ఇవి కలిసి పెద్ద రాజకీయ శక్తిగా మారే అవకాశాన్ని తగ్గించాయి. ఎన్నికల సమయంలో కుల, మత, ప్రాంతీయ భావోద్వేగాలను ప్రేరేపించడం ద్వారా ప్రధాన రాజకీయ పార్టీలు ఈ విభజనలను తమ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నాయి.

ఇంకా ఒక ముఖ్య అంశం,రాజకీయ పార్టీల నిర్మాణం. ప్రధాన పార్టీలలో బీసీ నాయకులు ఉన్నప్పటికీ, నిర్ణయాధికార కేంద్రాలు ఎక్కువగా అగ్రవర్ణ నాయకుల చేతుల్లోనే ఉండటం కనిపిస్తుంది. బీసీ నాయకులు ఎక్కువగా ఓటు బ్యాంక్‌ను సమీకరించే పాత్రలోనే ఉండిపోయారు. పాలనలో కీలక నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయికి చాలా తక్కువ మంది మాత్రమే చేరుకున్నారు. ఇది వ్యక్తిగత వైఫల్యం కాదు, పార్టీ వ్యవస్థలోని నిర్మాణాత్మక పరిమితి.

తెలుగు రాష్ట్రాల్లో బీసీ నాయకత్వం ఎదగడానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ, సామాజిక న్యాయం అనే నినాదంతో ముందుకు వచ్చింది. కొద్ది కాలంలోనే గణనీయమైన ఓటు శాతం సాధించడం ద్వారా బీసీలు, ఇతర వెనుకబడిన వర్గాలలో ఆశలు కలిగించింది. కానీ ఆ పార్టీ నిలదొక్కుకోలేకపోవడం, తరువాత కాంగ్రెస్‌లో విలీనం కావడం, బీసీ రాజకీయ ఆత్మవిశ్వాసానికి ఒక దెబ్బగా మారింది.



అలాగే దేవేందర్ గౌడ్, కాసాని జ్ఞానేశ్వర్ వంటి నాయకులు కూడా ప్రత్యామ్నాయ రాజకీయ వేదికలు సృష్టించేందుకు ప్రయత్నించారు. కానీ వారికి తమ స్వంత సామాజిక వర్గాల నుండి కూడా తగిన మద్దతు రాకపోవడం ఒక చేదు నిజం. ఇది బీసీ సమాజంలో రాజకీయ అవగాహన లోపాన్ని మాత్రమే కాకుండా, నాయకత్వంపై నమ్మకం కొరవడిన పరిస్థితిని కూడా చూపిస్తుంది.

ఇది చూస్తే ఒక ప్రశ్న తలెత్తుతుంది, బీసీలు నిజంగా రాజకీయంగా చైతన్య రాహిత్యంతో ఉన్నారా? లేదా వారి చైతన్యం సరైన దిశలో ప్రయాణించలేదా? నిజానికి బీసీలు ఓటు వేయడంలో చురుకుగా ఉంటారు. కానీ వారు సమిష్టిగా తమ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లే విధంగా రాజకీయంగా వ్యవహరించడం మాత్రం తక్కువగా కనిపిస్తుంది. వ్యక్తిగత లాభాలు, స్థానిక ప్రయోజనాలు, తక్షణ ప్రయోజనాల కోసం ఓటు వేయడం,దీర్ఘకాల రాజకీయ లక్ష్యాలను బలహీనపరుస్తుంది.

ఇక ఇతర రాష్ట్రాలను పరిశీలిస్తే, ఒక భిన్న దృశ్యం కనిపిస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ యాదవ్, అఖిలేష్ యాదవ్ వంటి నాయకులు బీసీలను, ముస్లింలను, ఇతర వెనుకబడిన వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి రాజకీయ శక్తిగా మారగలిగారు. బీహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్ అదే విధంగా సామాజిక న్యాయాన్ని రాజకీయ అజెండాగా మార్చి అధికారాన్ని సాధించారు.

తమిళనాడులో పెరియార్ ఈ.వి. రామస్వామి ప్రారంభించిన ఆత్మగౌరవ ఉద్యమం, తరువాతి దశలో రాజకీయ శక్తిగా మారి, అగ్రవర్ణ ఆధిపత్యాన్ని సవాలు చేసింది. సి.ఎన్. అన్నాదురై, ఎం.కరుణానిధి, ప్రస్తుతం ఎం.కె. స్టాలిన్ వంటి నాయకులు ఆ ఉద్యమాన్ని కొనసాగించారు. ఈ రాష్ట్రాల్లో సామాజిక చైతన్యం రాజకీయ మార్పుకు మార్గం చూపింది.

తెలుగు రాష్ట్రాల్లో ఈ తరహా దీర్ఘకాల సామాజిక ఉద్యమం కొరవడింది. బీసీ సమస్యలు ఎప్పటికప్పుడు చర్చకు వచ్చినప్పటికీ, అవి ఒక స్థిరమైన రాజకీయ ఉద్యమంగా మారలేకపోయాయి. దీనికి ఒక కారణం, విద్యా, ఆర్థిక అసమానతలు. ఇంకా ఒక కారణం, మేధావుల, ఉద్యమకారుల మధ్య సమన్వయం లేకపోవడం.

ప్రస్తుతం ఆర్. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, నరేందర్ గౌడ్, మాజీ ఐఏఎస్ ఆఫీసర్ చిరంజీవి, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, హనుమంతురావు, షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కత్తి వెంకటస్వామి, డాక్టర్ వినయ్ కుమార్, వంటి నాయకులు బీసీ హక్కుల కోసం దీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నారు. ఆర్ కృష్ణయ్య ఆయన చేసిన కృషి గౌరవనీయమైనదే. కానీ ఒక వ్యక్తి మాత్రమే మొత్తం వర్గాన్ని రాజకీయ అధికారంలోకి తీసుకురాలేడు. దానికి సమిష్టి ప్రయత్నం అవసరం. బీసీ మేధావులు, యువత, ఉద్యమకారులు, అందరూ కలిసి ఒక దిశగా కదలాలి.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తించాలి, రాజకీయ అధికారాన్ని పొందడం అంటే కేవలం ఎన్నికల్లో గెలవడం మాత్రమే కాదు. అది ఒక సామాజిక పరివర్తన ప్రక్రియ. విద్య, ఆర్థిక శక్తి, సామాజిక గౌరవం, అన్ని కలిసి రాజకీయ శక్తిని నిర్మిస్తాయి. ఈ మూడు అంశాలలో బీసీలు బలపడితేనే రాజకీయంగా ముందుకు వస్తారు.

మరోవైపు, "అగ్రవర్ణ పార్టీల వల్లే సమస్య" అని మాత్రమే చెప్పడం కూడా పూర్తిసత్యం కాదు. రాజకీయ పార్టీలు తమ ప్రయోజనాల కోసం పనిచేస్తాయి. వాటిని మార్చేది ప్రజలే. కాబట్టి మార్పు రావాలంటే, బీసీలు తమ ఓటు శక్తిని వ్యూహాత్మకంగా ఉపయోగించాలి. కేవలం భావోద్వేగంతో కాకుండా, విధానాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

2029 ఎన్నికల గురించి మాట్లాడితే, అది ఒక అవకాశం కావచ్చు. కానీ అది స్వయంగా విజయాన్ని హామీ ఇవ్వదు. బలమైన సంస్థాగత నిర్మాణం, స్పష్టమైన అజెండా, నమ్మదగిన నాయకత్వం, అవసరం. కేవలం "బీసీ" అనే గుర్తింపు సరిపోదు, సామాజిక న్యాయం, అభివృద్ధి, పారదర్శకత కలిపిన రాజకీయ దృష్టి అవసరం.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన ఒక ముఖ్యమైన సందేశం ఇక్కడ ప్రాసంగికం—రాజకీయ అధికారాన్ని పొందని వర్గాలు ఎప్పటికీ బలహీనంగానే ఉంటాయి. కానీ ఆయన అదే సమయంలో విద్య, సంఘటితం, ఆందోళన అనే మూడు మార్గాలను సూచించారు. అంటే కేవలం రాజకీయ పార్టీ స్థాపనతోనే మార్పు రాదు, అది ఒక విస్తృత సామాజిక ఉద్యమంగా మారాలి.

చివరగా, తెలుగు రాష్ట్రాల్లో బీసీల రాజకీయ భవిష్యత్తు పూర్తిగా వారి చేతుల్లోనే ఉంది. వారు తమ అంతర్గత విభేదాలను తగ్గించి, సమిష్టి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లగలిగితే, రాజకీయ సమీకరణాలు మారడం అసాధ్యం కాదు. కానీ అది ఒక్కరోజులో జరిగే పని కాదు. దీర్ఘకాల దృష్టి, సహనం, సమన్వయం,అవసరం.

సారాంశంగా చెప్పాలంటే—బీసీలు వెనుకబడ్డారని మాత్రమే చెప్పడం సరిపోదు, ఎందుకు వెనుకబడ్డారు, ఎలా ముందుకు రావాలి అన్న దానిపై స్పష్టత అవసరం. ఆ స్పష్టత వచ్చినప్పుడు మాత్రమే సామాజిక న్యాయం ఒక నినాదం నుండి వాస్తవంగా మారుతుంది.



మన్నారం నాగరాజు.
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

# అందమైన లోకమని, రంగురంగులు ఉంటాయని _ _ _!

అందమైన లోకమని, రంగురంగులు ఉంటాయని అందరూ అంటుటారు అంత అందమైనది కానేకాదు చెల్లమ్మా

ఈ కొన్ని పదాలు వినగానే మనసులో ఒక వేదన, ఒక నిశ్శబ్ద రోదన మొదలవుతుంది. ఇవి కేవలం ఒక సినిమా పాటలోని చరణాలు మాత్రమే కాదు.లక్షలాది మంది మనుషులు తమ జీవిత ప్రయాణంలో ఎదుర్కొన్న చేదు నిజాల ప్రతిబింబాలు. ఒక కవి కలం నుండి జాలువారిన ఈ చిన్న వాక్యాలు, కోటి తెలుగు గుండెలను పలకరిస్తాయి. ఆనందం, విషాదం, ఆశ, నిరాశల సమ్మేళనమైన ఈ చరణం లోని అంతరార్థాన్ని ఒకసారి విశ్లేషించుకుందాం.లోకం అనే పదానికి నిఘంటువు ప్రకారం అర్థం ప్రపంచం అని చెప్పొచ్చు. కానీ తెలుగు సాహిత్యంలో, జీవన గమనంలో లోకం తీరు అంటే కేవలం భౌగోళిక ప్రాంతం కాదు. మనుషుల నడవడిక, సమాజపు సంస్కారం, మానవ సంబంధాల లోతు ఇవన్నీ కలిపిన ఒక సజీవమైన వ్యవస్థ. మనం చిన్నప్పుడు అందమైన లోకంలోనే పెరుగుతాము. పువ్వులు, సీతాకోకచిలుకలు, అమ్మ కథలు, నాన్న కబుర్లు ఇవన్నీ చూసి లోకం అంటే ఇంత అందమా! అని మురిసిపోతాం. కానీ, జీవితం అన్నాక కష్టాలు, నష్టాలు, నమ్మకద్రోహాలు ఎదురైనప్పుడు ఆ చిన్ననాటి ఊహలన్నీ ఒక భ్రమగా మిగిలిపోతాయి. అంత అందమైనది కానేకాదు అనే నిజం తెలిసిన క్షణమే, వ్యక్తి పరిపక్వత చెందడం మొదలవుతుంది.రంగురంగులు ఉంటాయని అనే మాట ఒక లోతైన మెటఫర్. ఇది ఇంద్రధనస్సు రంగుల గురించి కాదు, మనుషుల ముసుగుల గురించి! నేటి సోషల్ మీడియా కాలంలో, ఈ భ్రమ మరింత బలపడింది. ఇతరుల జీవితాలను మనం స్క్రీన్ల మీద చూసి, వారు ఎంత సంతోషంగా ఉన్నారో! అని కుమిలిపోతుంటాం. కానీ ఆ ఫోటోల వెనుక ఉన్న ఒంటరితనం, ఆ చిరునవ్వుల వెనుక దాగున్న అప్పుల బాధ ఎవరికీ తెలియదు. ప్రతి విజయం వెనక వంద వైఫల్యాలు ఉంటాయి. మనం చూసేది కేవలం రంగులను మాత్రమే, ఆ రంగులు అద్ది పెట్టిన ముసుగును కాదు.ఈ సమాజంలో లోకం తీరు విచిత్రమైనది. మనం కింద పడితే చేయి అందించే వారికంటే, వేలెత్తి చూపించే వారే ఎక్కువ. అంత అందమైనది కానేకాదు అని కవి ఎందుకు అన్నారంటే, లోకం అంటే రంగులు మాత్రమే కాదు, చీకటి కోణాలు కూడా ఉన్నాయని గుర్తు చేయడానికే!

ఈ చరణంలో అత్యంత హృదయస్పర్శీ పదం చెల్లమ్మా, ఒక అక్క తన చెల్లెలికి జీవిత పాఠాలు చెబుతున్నట్టుగా ఉండే ఈ సంబోధన, ఆత్మీయతకు నిదర్శనం. తెలుగు సంస్కృతిలో అక్కాచెల్లెళ్లు బంధం అత్యంత పవిత్రమైనది. అక్క తన చెల్లెలిని ఈ లోకం నుండి, ఈ మోసాల నుండి కాపాడాలని తపిస్తుంది . చెల్లమ్మా, జాగ్రత్త! ఈ ప్రపంచం నువ్వు అనుకున్నంత అమాయకమైనది కాదు అని హెచ్చరించే ఆ అక్క గొంతులో, ఒక రక్షకరాలు బాధ్యత కనిపిస్తుంది. ఆ పిలుపులో ఆప్యాయతతో పాటు, లోకజ్ఞానాన్ని పంచుకోవాలనే తపన కూడా ఉంది.లోకం ఎందుకు అందంగా లేదో అర్థం చేసుకోవాలంటే, మనం మానవ నైజంలోకి వెళ్లాలి. డార్విన్ సిద్ధాంతం ప్రకారం అతిజీవనం కోసం పోరాటం (Survival of the Fittest) అనేది ప్రాథమిక సూత్రం. ఈ పోటీలో నైతికత, దయ, ప్రేమ వంటి విలువలు తరచుగా వెనకబడిపోతుంటాయి.నేటి స్వార్థపూరిత బంధాలు మనిషికి డబ్బు ఉన్నప్పుడు చుట్టూ జనం ఉంటారు, ఆపదలో ఉన్నప్పుడు ఎవరూ



ఉండరు.ఇతరుల బాధను చూసి సానుభూతి చూపడం కంటే, దాన్ని వినోదంగా చూసే ఒక వికృత మనస్తత్వం సమాజంలో పెరిగింది. అయితే, ఇది పూర్తిగా నిరాశావాదం కాదు. బంగారం అరుదుగా ఉన్నట్టే, నిజమైన ప్రేమ, నిష్కపటమైన స్నేహం కూడా అరుదు. అవి దొరికినప్పుడు ఆ విలువ తెలుస్తుంది. అందుకే కవి అందమైనది కానేకాదు అని చెప్పడం ద్వారా, మనం ఆ అందాన్ని మనమే సృష్టించుకోవాలని పరోక్షంగా సూచిస్తున్నారు.భగవద్గీతలో కృష్ణుడు చెప్పిన మాయ గురించి మనం ఎప్పుడూ ఆలోచించాలి. మనం చూసే ఈ దృశ్యజాలం అంతా మాయ అని, నిజమైన సత్యం వేరే ఉందని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. అందమైన లోకం అని మనం భ్రమపడటం కూడా ఆ మాయలో భాగమే. బౌద్ధ తత్వం కూడా దుఃఖమే సత్యం అని నొక్కి చెబుతుంది.అయితే, ఈ దుఃఖాన్ని అర్థం చేసుకున్నప్పుడే మనిషికి నిజమైన ముక్తి కలుగుతుంది. నిరాశలో కూరుకుపోవడం అంటే సమస్య కాదు, నిజాన్ని అంగీకరించి ఆ నిజాన్ని అధిగమించి ఎదగడమే అసలైన విజయం.నేటి వేగవంతమైన ప్రపంచంలో, కృత్రిమ మేధ (AI) పెరుగుతున్న తరుణంలో, మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. పెరుగుతున్న జీవన వ్యయం, ఒత్తిడి, మానసిక సంఘర్షణల నడుమ యువత చాలా సులభంగా నైరాశ్యంలోకి జారిపోతున్నారు. అటువంటప్పుడు ఈ చరణం ఒక రియాలిటీ చెక్ (Reality Check) లా పనిచేస్తుంది. జీవితం అందమైనది కాదు కాబట్టే, మనం దాన్ని అందంగా మార్చుకోవాలి.నీ చూపు మారాలి ,లోపాలను వెతకడం మానేసి, ఉన్న దాంట్లో ఆనందాన్ని వెతకడం నేర్చుకోవాలి. నీ మనసు మారాలి ,లోకం నిన్ను మోసం చేసినా, నువ్వు మాత్రం నీలోని మంచిని కోల్పోకూడదు.ముగింపుగా ఒక్క మాట లోకం రంగురంగులుగా లేదు అని నిరాశపడటం కాదు, ఆ రంగులను మనమే మన ఆశలతో, మన ఆశయాలతో నింపుకోవాలి. అంత అందమైనది కానేకాదు అని తెలుసుకున్నవాడే, అసలైన అందాన్ని ఎలా నిర్మించుకోవాలో తెలుసుకోగలడు.ఈ అద్భుతమైన చరణం, కేవలం పాట కాదు, ఒక జీవన వేదం. లోకం తీరు తెలిసిన వాడు, ఆ లోకంలోనే ఉంటూ, దేనికీ అంటకుండా, తనకంటూ ఒక చిన్న అందమైన ప్రపంచాన్ని నిర్మించుకుంటాడు. అదే ఈ కవి మనకు అందించిన అమూల్యమైన, శాశ్వత సందేశం.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# పేదల సంక్షేమానికి ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పథకాలు
# అర్హులందరికీ అందితేనే నెరవేరనున్న ప్రభుత్వ లక్ష్యం

- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

ఇబ్రహీంపట్నం వెలుతురు మే 02:





ఇబ్రహీంపట్నం మండలంబొంగ్లూర్ ప్రమిద గార్డెన్ లో జరిగిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక నియోజకవర్గస్థాయి సమావేశం ముఖ్యఅతిథిగా హాజరైన ఇబ్రహీంపట్నంఎమ్మెల్యే మల్ రంగారెడ్డి సం దర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పథకాలు అర్హులైన ప్రజ లకు అందినప్పుడే సర్కార్ లక్ష్యం నెరవేరుతుందనిఈ బాధ్యత అధికారులపైనే ఉంటుందని అన్నారు సంక్షేమ పథ కాల అమలు విషయంలోని ర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే సహించ బోమని హెచ్చరించారు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 కా ర్యక్రమంలో భాగంగా ఈసమావేశానికి అబ్దుల్లాపూర్ మెట్ మంచాల యాచారం ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని ఆర్డీవో అనంతరెడ్డి సమావేశంలో చదివి వినిపించారు అనంతరం ప్రజాపాల నప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి6నుంచి గ్రామస్థాయిలో మండల స్థాయిలో చేపట్టిన కార్యక్రమాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహంచారు వివిధ అంశాలపై అధికారులతోఆరా తీసిన ఎమ్మెల్యేఇందిరమ్మ ఇళ్లు గృహ జ్యోతి రైతుభరోసా పెన్షన్లు డ్వాక్రారుణాలు తదితర పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు పేద ప్రజలసంక్షేమం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే మల్ రెడ్డి చెప్పారు ప్రభుత్వలక్ష్యం నెరవేరాలంటే అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా అధికారులు దృష్టి సారించాలని చెప్పారు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వ హిస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందు కు సాగి పథకాలను ప్రజలకు చేరేలా చూడాలన్నారు అంతకు ముందు వ్యవసాయ వైద్యారోగ్య ఐసీడీఎస్ ఐకేపీ.ఉద్యానవన తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి.వారికి అభినందనలు తెలిపారు ఈకార్యక్రమంలో గడ్డన్నారం మార్కెట్ కమి టీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లిగురునా థ్ రెడ్డి ఈసీ శేఖర్ గౌడ్ మామపాండు రంగారెడ్డి కొత్త కురుమ శివకుమార్ తహసిల్దార్ అధికారు లు అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## ప్రాధాన్యత క్రమంలో మౌళిక వసతులను అభివృద్ధి పరుస్తాం : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 02:

శనివారం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి విమానపురి కాలనీలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కాలనీలోని భూగర్భ డ్రైనేజీ సమస్యపై అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీలో భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లడంతో రోడ్లపై మురుగునీరు పారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధిపరిచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఈ బాల మురళీ, ఏఈ గోపాల కృష్ణ, మేనేజర్ శివ ప్రసాద్, విమానపురి కాలనీ ప్రెసిడెంట్ సుధాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జిట్టా బల్వంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాఘవ రెడ్డి, కోశాధికారి అరుణ్ కుమార్, సలహాదారులు బలరాం రాజు, వెంకట రమణ, రామా రావు, జిట్టా రామేశ్వర్ రెడ్డి, అజెష్, క్రిష్ణ గౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి, కమలాకర్ గౌడ్, స్థానిక నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్ల కంటి కుమార్, నదీమ్ రాయ్, ఆటో బలరాం, కుంట వేణు, సంతోష్ గౌడ్, నల్ల వేణు, బాల మల్లేష్, విజయ్ హరీష్, చంద్రశేఖర్ రెడ్డి, జోయెల్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి





- **షాద్‌నగర్ ప్రగతి సభలో అదనపు కలెక్టర్ కిరణ్మయి**
- **మహిళా సంఘాలకు రూ.238 కోట్ల వడ్డీ లేని రుణాలు**
- **14 ఏళ్లు దాటిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ టీకా తప్పనిసరి**
- **సైబర్ నేరాలపై జాగ్రత్త.. మోసపోతే వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలి**
- **ఇంటిగ్రేటెడ్ పాఠశాలలతో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు: ఎమ్మెల్యే శంకర్**

రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 2:

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' నియోజకవర్గ స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు వారి ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించారు. ముఖ్యంగా 14 ఏళ్లు దాటిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా తప్పనిసరిగా వేయించాలని కోరారు.

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఈ సభలో మహిళా సంఘాలకు రూ. 238 కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తున్నట్లు కిరణ్మయి తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వాం, ఏసీపీ లక్ష్మీనారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలనప్రగతి ప్రణాళిక



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 02:

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్.శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి లో గల కె.వి.ఆర్ కన్వెన్షన్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 6 గ్యారంటీలను సంక్షేమ పథకాలను ప్రభుత్వ అధికారులు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలిపారు, అధికారులందరూ తమ యొక్క శాఖల వారీగా చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలు అన్ని తొందరగా పూర్తిచేయడం ప్రజల అవసరాలు తీర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఇన్చార్జ్ హనుమంత్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ, మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మరియు ఇతర ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



మాడ్గుల మే 02 (వెలుతురు):

మాడ్గుల మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముక్కెర నరసింహ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ 3వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బిఆర్ఎస్ కార్యకర్తల ద్వారా అందజేశారు. అదేవిధంగా సుదర్శన కృష్ణ ఫౌండేషన్ అధ్యక్షుడు గౌరవరం వెంకట్ రెడ్డి 3వేల రూపాయలు, తెలంగాణ బ్లాక్ వాయిస్ వ్యవస్థాపకులు,బిఆర్ఎస్ నాయకుడు గోవింద్ శ్రీధర్ 2వేల రూపాయలు మృతుని కుటుంబ సభ్యులకు గ్రామస్తులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఉడుతల సత్తయ్య,అడవి రాములు, గుండాల మల్లేష్,పులికంటి యాదగిరి,సంట్రింగ్ ఉడుతల గణేష్,పల్లేటి నరసింహ,
బండ మల్లయ్య, పల్లేటి రాములు, ముక్కెరి జంగయ్య,పల్లేటి ట్యాంక్ రాములు,ముక్కెరి శ్రీశైలం, పల్లేటి జనార్ధన్,కాస పర్వతాలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఐని సన్మానించిన ఉప సర్పంచ్ కేతావత్ హీరాసింగ్ నాయక్



వెలుతురు కడ్తాల్ మే 02:

కడ్తాల్ మండల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ సైదిరెడ్డి ని మైసిగండి ఉప సర్పంచ్ కేతావత్ హీరాసింగ్ తదితరులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో సన్మానించి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు తులసిరామ్ నాయక్ , మైసిగండి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాలి

- **మహేశ్వరం ప్రగతి సభలో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి**
- **అర్హులైన ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం**
- **మహిళా సాధికారతకు పెద్దపీట.. ఆర్థికంగా బలోపేతం చేసేలా చర్యలు**
- **గ్రామాల్లో సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్న అదనపు కలెక్టర్**

రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 2:





రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'ను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గ స్థాయి ప్రగతి ప్రణాళిక సమావేశం కాకి ఈశ్వర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ గీతాన్ని ఆలపించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ గ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు నర్సింహారెడ్డి వెల్లడించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి మాట్లాడుతూ.. తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం మరియు పారిశుద్ధ్య పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు అర్హులకు చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి "టాప్ మార్కులు" సాధించిన త్రివేణి విద్యార్థులను అభినందించిన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 02:

ఇటీవల విడుదలయిన 10వ తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన త్రివేణి స్కూల్ చింతల్ విద్యార్థులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన చరణ్ తామిరి (581) నిత్యశ్రీ మాదంశెట్టి (581), రూప శ్రీ లక్ష్మి నాగ సాయి బుసం (580) , శ్రావణి పి (578), వినీత్ రెడ్డి ఎద్దండి (577),గీతిక బిట్ల (576),తేజేశ్వర్ కంటే (576),చైతన్య కిశోర్ బల్లి (575), గణేష్ సాయి, సాత్విక్ యలక (572), నాగ వైష్ణవి (568) లను అభినందించారు.అనంతరం వారు మాట్లాడుతూ..... ఈ విజయం విద్యార్థుల పట్టుదలకు మరియు త్రివేణి యాజమాన్యం యొక్క అంకితభావానికి దక్కిన అసలైన ప్రతిఫలమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో త్రివేణి విద్యాసంస్థల ప్రతినిధులు సి.ఎస్.ఓ సుబ్బారావు, సి.ఆర్.ఓ వెంకట్రావు, చింతల్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ శ్రీమతి శివ కీర్తన, అకాడమిక్ ఇన్చార్జ్ చిన్నారావు, ఇంపాక్ట్ ఇన్చార్జ్ వనిత, క్యాంపస్ ఇన్చార్జ్ క్రాంతి మరియు అధ్యాపక బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఫుట్ పాత్ ఆక్రమణపై ఉక్కుపాదం

- **టెలికం నగర్ నుంచి ఉర్దూ యూనివర్సిటీ వరకు ఆక్రమణల తొలగింపు..**

శేరిలింగంపల్లి వెలుతురు మే 02:

ఫుట్ పాత్ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ ఏసిపి వెంకటరమణ అన్నారు. శనివారం సర్కిల్ పరిధిలోనీ గచ్చిబౌలి టెలికం నగర్ నుంచి ఉర్దూ యూనివర్సిటీ వరకు ఉన్న ఆక్రమణల ను టీపీఎస్ సాయి తేజ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. సర్కిల్ పరిధిలో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. ప్రతి శనివారం ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడుతు




న్నామనారు. తొలగింపులో చైన్మెన్లు మోహన్, మహారాజ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సమ్మి గౌడ్ చిలువేరు

- **వధూవరులకు నూతన పట్టు వస్త్రాలు బహుకరించిన సమ్మయ్య గౌడ్**

కేసముద్రం వెలుతురు మే 02:

కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామం చంద్రుతండాకు చెందిన
బానోత్ కైక బిక్ష(లేటు) ల కుమారుడు గణేష్ వివాహం వధువు స్రవంతితో జరగగా ఈ వివాహ మహోత్సవ వేడుకకు గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై నూతన వధూవరులను వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సు





లు వారిపై మెండుగా ఉండాలని వధూవరుల కు నూతన పట్టు వస్త్రాలు అందజేసి అక్షంత లు వేసి ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో*సమ్మి గౌడ్ వెంట భూక్య శ్రీనివాస్ నాయక్,బానోత్ అశోక్ నాయక్, లకావత్ మనోజ్ కుమార్,మాలోత్ భాస్కర్,భానోత్ రాజు, గూగుల్ లింగా,భూక్య భాస్కర్, చంద్రుతండా యువత తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల రీయంబర్స్మెంట్ స్కీమును ఎత్తి వేయడానికే జీవో నెంబర్ 7 తీసుకు వచ్చారు

- **జీవో నెంబర్ 7ప్రతుల దగ్ధం**
- **ఆనాటీ కాంగ్రెస్ ఫీజుల స్కీం తెస్తే, ఈనాటి కాంగ్రెస్ ఈ స్కీమును రద్దు చేయాలని చూస్తుంది**
- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ధ్వజం**

హైదరాబాద్ వెలుతురు మే 02:

2008 సంవత్సరంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని తీసుకువస్తే, 2026లో నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని



రద్దు చేయాలని కుట్ర చేస్తుందని బీసీ జేఏసీ కన్వీనర్ జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్మెంట్ నీరు కార్చే జీవో నెంబర్ 7 ప్రతులను దగ్ధం చేయడం జరిగింది.

ఫీజుల రీయంబర్స్మెంట్ బకాయిలు గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వాలు విడుదల చేయక పోవడంతో కొన్ని కళాశాల యజమాన్యాలు హైకోర్టుకు వెళ్లారని, రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యార్థుల పక్షాన బలమైన వాదనలు వినిపించాల్సిన ప్రభుత్వం ఫీజుల రియంబర్స్మెంట్ స్కీమును దశలవారీగా రద్దు చేసే కుట్రలో భాగంగానే కోర్టుకు సరైన వాదనలు వినిపించలేదని ఆయన ఆరోపించారు.దీనితో విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేసుకోవచ్చు అని రాష్ట్ర హైకోర్టు మద్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని,ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని యధావిధిగా కొనసాగిస్తామని హైకోర్టుకు నివేదించాల్సిన ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా యజమాన్యాల ఖాతాలకు కాకుండా విద్యార్థుల ఖాతాలకే ఫీజుల నిధులు చెల్లిస్తామని తేనె బూసిన కత్తిలా జీవో నెంబర్ 7ను విడుదల చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.జీవో నెంబర్ ఏడు విడుదల చేయడమంటే పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేయాలనే కుట్ర దాగి ఉందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య ఫరూఖ్ ఊరిబండి శ్రీనివాస్ యాదవ్ ఎస్పీ నాయుడు బంటు సైదులు అంజి రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## సింగర్ మంగ్లీ జోలికి వస్తే నాలిక కోస్తాం
## సేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు మోతీలాల్ నాయక్

బషీర్ బాగ్ మే 2 (వెలుతురు ):

గిరిజన బిడ్డ ఎదుగుదలను ఓర్వలేక కొన్ని యూట్యూబ్ ఛానల్స్ అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ.. ప్రముఖ గాయని మంగ్లీ ని అభాసుపాలు చేస్తున్నారని సేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ ఆరోపించారు. కావాలనే ఆమెను వ్యక్తి గతంగా టార్గెట్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు శనివారం హైదర్ గూడ లోని న్యూస్ సెంటర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ పనిగట్టుకుని వ్యూస్ కోసం గాయని మంగ్లీ పై ఇష్టారీతిన అసభ్యకరంగా లేనివిగా ఉన్నట్లుగా గ్లోబల్ ప్రచారం చేస్తూ ఆమెతోపాటు కుటుంబాన్ని కూడా లాగి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన బిడ్డ ఎదుగుదలను ఓర్వలేక నానా రకాలు ఇబ్బందులు పెడుతూ పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు.
ఒక ఇద్దరూ సుద్దపూసలు కావాలనే మీడియా ముందుకు వస్తూ పథకం ప్రకారం మంగ్లీ ని టార్గెట్ చేస్తున్నారని.. కేసు పోలీసు దర్యాప్తు లో ఉందని, ఒకవేళ మంగ్లీ తప్పు చేస్తే ఎక్కడి రమ్మంటే అక్కడికి వస్తానని ఆయన సవాల్



విసిరారు. మంగ్లీ జోలికొస్తే సహించేది లేదని.. ఆమె కు రెండు తెలుగు రాష్ట్రాల్లో బంజారాలు అండగా ఉంటామని స్పష్టం చేశారు. మంగ్లీ ని ఎవరైనా దూషిస్తే ఇకపై ఊరుకునేది లేదని వారి నాలుక కోస్తామని ఆయన హెచ్చరించారు. మైక్రో ఫైనాన్స్ విషయంలో నిజనిజాలు నిగ్గు తేల్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర డిజీపీ చొరవ తీసుకుని సీబీసీఐడీ తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.
సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక జాతి అధ్యక్షులు , కోర్ర మోతిలాల్ నాయక్ , ఓయూ నేత రవీందర్ నాయక్ , సేవాలాల్ బంజారా సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ధరావత్ గణేష్ నాయక్ , అభిషేక్ రాథోడ్ , రమావత్ మోహన్ నాయక్ , రేవంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## మేడ్చల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతన జిల్లా మరియు సెషన్ కోర్టు హాల్ ప్రారంభం





మేడ్చల్, వెలుతురు మే 02:

మేడ్చల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన జిల్లా మరియు సెషన్ కోర్టు హాల్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి గౌరవ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు మరియు జిల్లా ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**ముఖ్య అతిథులు**

నూతన కోర్టు హాల్‌ను ఈ క్రింది ప్రముఖులు రిబ్బన్ కత్తిరించి అధికారికంగా ప్రారంభించారు

గౌరవ జస్టిస్ కె. లక్ష్మణ్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మరియు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి. గౌరవ జస్టిస్ బి. విజయ్ సేన్ రెడ్డి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి. గౌరవ జస్టిస్ నందికొండ నర్సింగరావు: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి.

శ్రీ మను చౌదరి మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్.

**కార్యక్రమ విశేషాలు:**

జ్యోతి ప్రజ్వలన

కార్యక్రమం ప్రారంభంలో గౌరవ న్యాయమూర్తులు మరియు కలెక్టర్ గారు జ్యోతి ప్రజ్వలన గావించి, సాంప్రదాయబద్ధంగా వేడుకను ప్రారంభించారు.

వసతుల పరిశీలన అనంతరం నూతనంగా నిర్మించిన కోర్టు హాల్‌లోని సౌకర్యాలను, న్యాయమూర్తుల ఛాంబర్లను వారు పరిశీలించారు.

**లక్ష్యం:**

పెరుగుతున్న కేసుల దృష్ట్యా, కక్షిదారులకు మరియు న్యాయవాదులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, న్యాయ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఈ నూతన కోర్టు హాల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు అధికారులు మరియు కోర్టు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



వెలుతురు కడ్తాల్ మే 02:

రైతులు తాము పండించిన వరి ధాన్యన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం లో మాత్రమే అమ్మి గిట్టుబాటు ధర పొందాలని అన్నారు,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి.ఈ మేరకు శనివారం కడ్తాల్ మండల కేంద్రం లో మండల మహిళ సమైక్య ఆధ్వర్యం లో రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన దళారులను నమ్మి మోసాపోవద్దని సూచించారు .ఈ కార్యక్రమంలో ఎఏంసి మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, ఎఏంసి డైరెక్టర్ రవీందర్,గ్రామ సర్పంచ్ బిక్షపతి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కుమారి,ఏపీఎం రాములు, స్టేట్ బోర్డ్ పొల్యూషన్ సభ్యులు బాలాజీ సింగ్,పీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్,డీసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనరసింహ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచ్య నాయక్, ఉప సర్పంచ్ ఈ రెడ్డి యాదిరెడ్డి,మాజీ ఏంపిటిసి చేగురు వెంకటేష్,వార్డు సభ్యులు జాంగిర్ బాబా, బానుకిరణ్,రమేష్ రైతులు రాములు, శ్రీలత,నరసింహ, ధనలక్ష్మి హైమావతి రజిని అకౌంటెంట్ విజేందర్ వీఓఏలు లు పాల్గొన్నారు.

## వీహెచ్ కు హిమాయత్‌నగర్ డివిజన్ నేతల అభినందనలు

- **శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్**

హైదరాబాద్, వెలుతురు మే 02:

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ వీ హనుమంత రావు బీసీ అడ్వైజర్‌గా నియమితులైన సందర్భంగా హిమాయత్‌నగర్ డివిజన్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావును శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.
ఈ సందర్భంగా ఆయనకు నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని కోరుతూ శుభా



కాంక్షలు తెలిపారు. బీసీ వర్గాల అభివృద్ధికి ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధర్మాచరణ కోసమే నారదుడు.. ఇందుకే నారద జయంతి

హైదరాబాద్ వెలుతురు మే 02:

మహర్షి నారదుడు ధర్మాచరణ పరాయణుడని, అందరూ అనుకున్నట్టు కలహ భోజనుడు కాదని, నిజానికి ఆయనే మొదటి పాత్రికేయుడని చాలామందికి అవగాహన లేదని, పైగా ఈ మహర్షిని కార్టూన్ల రూపంలో నవ్వులపాలు చేసేందుకు ప్రయత్నించారని హైదరాబాదులో శనివారం జరిగిన నారద జయంతి కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు పేర్కొన్నారు. సమాచారభారతి ఆధ్వర్యంలో కోఠిలోని వైఎంఐఎస్ హాలులో జరిగిన ఈ ఉత్సవంలో మీడియాలోని వివిధ విభాగాలకు చెందిన పలువురు జాతీయవాద జర్నలిస్టులకు పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. పురస్కారాలను అందుకున్నవారిలో 'వార్త' దినపత్రిక సంపాదకులు దామెర్ల సాయిబాబా, సీనియర్ జర్నలిస్ట్ జంధ్యాల శరత్ బాబు, మహిళా జర్నలిస్టువీడియో బ్లాగర్ వల్లీ పద్మాంజలి (అంజలి), సీనియర్ కార్టునిస్ట్ సరస్వతుల రామ నరసింహం (సరాసి), ఐన్యూస్ చానెల్ వరంగల్ బ్యూరో చీఫ్ బూరం ప్రశాంత్, రాజ్ టీవీ న్యూస్ చీఫ్ ఎడిటర్ లక్ష్మి ఉన్నారు. వీరికి సమాచార భారతి అధ్యక్షులు ప్రొఫెసర్ జి గోపాల్ రెడ్డి, సంస్థ ఉపాధ్యక్షులైన సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్, జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి చేతుల మీదుగా సత్కారాలు, పురస్కార ప్రదానం జరిగాయి.
తొలుత సమాచార భారతి అధ్యక్షులు ప్రొఫెసర్ జి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మీడియా రంగానికి ఈ సంస్థ చేస్తున్న సేవలను వెల్లడించారు. సమాచార భారతి మూడు దశాబ్దాలుగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ మీడియా రంగానికి సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తోందని తెలిపారు. వక్రీకరణ జరిగిన భారతదేశ చరిత్రను సరైన దిశలో ప్రపంచానికి తెలియజేయడానికి సమాచార భారతి కృషి చేస్తున్నదని, అందులో భాగంగానే పాత్రికేయ మిత్రులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, సోషల్ మీడియా సంగమాలు, పాత్రికేయ శిక్షణా శిబిరాలు వంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. జాతీయవాద పాత్రికేయుల్ని తయారు చేయడం కోసం జర్నలిజం కళాశాలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ జర్నలిజం కళాశాలలకు వెళ్లిన సందర్భంలో మొట్టమొదటి పాత్రికేయుడు ఎవరు? అని అడిగినప్పుడు పాశ్చాత్యుల పేర్లు చెప్పేవారు తప్ప నారదుడి గురించి ఎవ్వరూ చెప్పలేదన్నారు. కానీ మనం నారదుని పేరు చెప్పిన తర్వాత ఒప్పుకున్నారన్నారు. మరి ఇన్నాళ్ళూ ఎందుకు నిర్లక్ష్యం చేశారనే ప్రశ్నకు ఎవ్వరి దగ్గర సమాధానం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత్రికేయులను సత్కరించేందుకు ప్రతి ఏటా సమాచార భారతి సంస్థ నారద జయంతి జరుపుతున్నదని, ఈ వేడుక ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను మరోసారి మననం చేసుకునే అవకాశం దక్కుతుందన్నారు. అవకాశం చిక్కినప్పుడల్లా నారద మహాముని గురించి పాత్రికేయులు ప్రచారం చేయాలని కోరారు.
ముఖ్య అతిథి, జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి మాట్లాడుతూ దేశం అంతరాత్మను మలిచే బాధ్యతను, దేశానికి అవసరమైన అసలైన విషయాలను గుర్తించి సమాజానికి తెలియజేసే బాధ్యతను గుర్తించే రోజు ఈ నారద జయంతి అన్నారు. జర్నలిజం అనేది ఒక



ఉత్తమ రూపంగా చేసే ప్రజా సేవ అని కొనియాడారు. ఇది 'ధైర్యానికి', 'సత్యానికి', 'బాధ్యతాయుతమైన జర్నలిజం శక్తికి '' జరుగుతున్న ఉత్సవం అన్నారు. తాను సభ్యురాలిగా ఉన్న NHRC ప్రారంభం నుంచీ మీడియా శక్తిని, సేవలను వినియోగించుకుందని తెలిపారు. మానవహక్కుల పరిరక్షణ, ప్రోత్సాహంలో మీడియాని కూడా భాగస్వామిగా భావిస్తున్నదన్నారు. మీడియా ఇచ్చే నివేదికలను NHRC విశ్వసిస్తుందని చెప్పారు. మీడియా కథనాలను సుమోటోగా కూడా స్వీకరించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని తెలియజేస్తూ పోలవరం నిర్వాసితులు, సందేశ్ కాలీ సహా పలు సంఘటనలను ఉదహరించారు.
అనంతరం అవార్డు గ్రహీతలు తమ స్పందనను తెలిపారు. ముందుగా మహిళా జర్నలిస్టు వల్లీ పద్మాంజలి (అంజలి) మాట్లాడుతూ నారద జయంతి సందర్భంగా సమాచార భారతి సంస్థ జర్నలిస్టులను గుర్తించి అవార్డు ఇవ్వడం అనేది చాలా గొప్ప విషయమన్నారు. జర్నలిస్టులుగా చాలా ఏళ్ళు కష్టపడుతుంటామని, ఎవరూ గుర్తించట్లేదని బాధపడుతుంటామని పేర్కొంటూ సీనియర్ జర్నలిస్టుల మధ్య ఈ పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సమాచార భారతి బృందానికి ధన్యవాదాలు తెలిపారు.
సీనియర్ జర్నలిస్టు, 'వార్త' దినపత్రిక సంపాదకులు దామెర్ల సాయిబాబా మాట్లాడుతూ తనకు ఈ పురస్కారం లభించినప్పటికీ, తాను సాధించిన విజయాల వెనుక ఎందరో సహకారం అందించారన్నారు. తన వృత్తి జీవితంలో భాగంగా అందించిన పలు సంచలనాత్మక కథనాల వెనుక పడిన శ్రమను వివరిస్తూ కరీంనగర్ జిల్లా నుంచి పంజాబ్ ఉగ్రవాదులకు అక్రమంగా ప్రేలుడు పదార్థాల చేరవేత ఘటన సహా పలు సంఘటనల పరిణామాలను వివరించారు. మంచి జర్నలిస్టులను తయారు చేసే దిశగా మరింత మెరుగైన శిక్షణను ఇచ్చే ప్రయత్నాలు జరగాలని, జర్నలిజం అనేది ఒక పవిత్రమైన వృత్తి అని స్పష్టం చేశారు.
సీనియర్ కార్టూనిస్ట్ సరస్వతుల రామ నరసింహం (సరాసి) స్పందిస్తూ మహర్షి నారదుడిని ఓ కార్టూన్ క్యారెక్టర్‌గా సినిమా వారు తయారు చేశారని ఆవేదన చెందారు. నారదుడిని నవ్వుల పాలు చేయబోయి.. వారే నవ్వుల పాలయ్యారన్నారు. సమాజంలో ప్రబలిన అతివాద ధోరణులే కార్టూన్లకు ఇంధనం అంటూ మనుషుల్లో విపరీత ధోరణులు పెరిగిపోయాయన్నారు. కార్టూనిస్టు ఎక్కువగా మాట్లాడకూడదని, కార్టూనే ఎక్కువ మాట్లాడాలని... తెలియజేస్తూ వ్యాఖ్యారహిత కార్టూన్లకే విలువ ఎక్కువగా వుంటుందన్నారు. అదే సమయంలో తెలుగు భాషను బతికించడానికి పాత్రికేయులందరూ ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. కార్టూన్ వల్ల సమాజానికి చాలా ప్రయోజనం వుందన్న సరాసి, అందరూ కార్టూన్ల వల్ల మారిపోరని, కానీ ఆ ప్రయత్నం చేస్తూంటే ఎప్పుడో ఒకప్పుడు సార్థకత చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
రాజ్ టీవీ న్యూస్ చీఫ్ ఎడిటర్ లక్ష్మి మాట్లాడుతూ తనకు ఈ పురస్కారాన్ని అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు.
సీనియర్ జర్నలిస్టు జంధ్యాల శరత్ బాబు ప్రసంగిస్తూ ఈ పురస్కారాలు, సన్మానాలు తమకు చాలా సంతోషాన్నిస్తాయన్నారు. అయితే, జర్నలిజం వృత్తి అవునా? కాదా? అన్న సమస్య వచ్చిందంటూ మన పిల్లలకి దీనిని వారసత్వంగా ఇస్తామా లేదా అన్నది ప్రశ్నగానే ఉందన్నారు. తాను వృత్తి జీవితంలో పనిచేసినంత కాలం ఎప్పుడు అవకాశం లభించినా జాతీయవాద దృక్పథాన్ని కాపాడుతూనే రాశానన్నారు. వార్తను మొదట మనం అర్థం చేసుకున్నాకే ప్రజలకు అందించాలని, అప్పుడే సరైన సమాచారం ప్రజలకు చేరుతుందని అన్నారు. మనం రాసే రాతల్లో, మాట్లాడే మాటల్లో నిజాయితీ లేకుంటే రాణించలేమని, ఒక్క రోజు కూడా ఉద్యోగం చేయలేమని, నిబద్ధత, అంకితభావం లేకుంటే ప్రతి రోజూ అగ్నిపరీక్షలేనని స్పష్టం చేశారు.
ఐన్యూస్ చానెల్ వరంగల్ బ్యూరో చీఫ్ బూరం ప్రశాంత్ స్పందిస్తూ జాతీయవాద సంస్థ సమాచారభారతి తనకు నారద జయంతి అవార్డును ఇవ్వడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. తాను మొదట్లో ప్రెస్ నోట్లు బాగా రాస్తున్నానని ఏబీవీపీ వారు గమనించి ప్రోత్సహించారని, అప్పటి నుంచి జాతీయవాదం వైపు తన ప్రస్థానం ప్రారంభమైందని చెప్పారు. తన వృత్తి జీవితంలో భాగంగా అందించిన సంచలన నేరెళ్ల ఘటన, వరంగల్‌లో అర్చకుడి హత్య ఘటనలను బయటకు తీసుకురావడంలో లభించిన ప్రోత్సాహం, పడిన శ్రమ, NHRC పాత్రలను ప్రశాంత్ వివరించారు. ఈ క్రమంలో మేడారం సమక్క సారక్క జాతరకి సంబంధించి చాలా ఛానెళ్లు కాకతీయులను విలన్లుగాను, సమ్మక్క సారలమ్మలను రాజులుగా చూపిస్తున్నారంటూ అది తప్పు అని నిరూపించేందుకు సమ్మక్క సారక్కల సంబంధీకులతో కూడా మాట్లాడానన్నారు. వారు సమ్మక్క సారలమ్మలను మహిమాన్విత దేవతలుగానే చెప్పారు తప్ప, కాకతీయులతో యుద్ధం చేసినట్లు మాత్రం లేదన్నారు, ఢిల్లీ సుల్తానులతో కొట్లాడినట్లు మాత్రం చెబుతున్నారన్నారు. ఈ విషయమై తప్పుడు చరిత్రతను ప్రచారం చేస్తున్నారన్న ప్రశాంత్ ఇప్పటికీ దీనిపై పరిశోధన చేస్తున్నట్టు చెప్పారు.
కార్యక్రమంలో భాగంగా ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులైన జర్నలిస్టు పసుపుల మన్యంకొండకు నివాళి అర్పించారు.

# పులిపలుపుల గ్రామంలో కుమ్మర సంఘం నూతన కమిటీ ఎన్నికలు



**మునుగోడు మే 2(వెలుతురు న్యూస్):**

మునుగోడు మండలంలోని పులిపలుపుల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో గ్రామ కమిటీ ఎన్నికలు ఉత్సాహ భరితంగా నిర్వహించబడ్డాయి. గ్రామంలోని కుమ్మర కుటుంబాల సమక్షంలో జరిగిన ఈ సమావేశం ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. సంఘ బలోపేతం, వృత్తి అభివృద్ధి, యువత భాగస్వామ్యం లక్ష్యంగా నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ కంభంపాటి భూపాల్ అధ్య క్షత వహించగా,ముఖ్య అతిథులుగా విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డా. కంభంపాటి సత్య నారాయణ, నియోజకవర్గ కన్వీనర్ సిలివేరు సత్తయ్య హాజరయ్యారు.వారు కుమ్మర వృత్తి పరిరక్షణ,ప్రభుత్వ సంక్షేమ పథకాల సాధ న,యువత పాత్రపై ప్రసంగించారు.ఎన్నికైన కమిటీ వివరాలు ఇలా ఉన్నాయి,అధ్యక్షుడు వరగంటి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కంభంపాటి గణేష్,కోశాధికారి కంభంపాటి శ్రీకాంత్,ఉపాధ్యక్షులుగా కంభంపాటి మార య్య,పుల్లయ్య,వరగంటి ఊషయ్య,సహాయ కార్యదర్శులుగా పెద్ద వెంకటయ్య,గురుమూర్తి ,స్వామి,వెంకటేశ్వర్లు, దామోదర్, సైదులు ఎం పికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా కంభంపాటి మారయ్యను నియమించారు.నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కుమ్మర కుటుంబానికి సంఘం అండగా నిలిచి, వృత్తి పరిరక్షణతో పాటు విద్య, ఉపాధి అవకా శాల కోసం కృషి చేస్తామని తెలిపారు.సమావే శంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్త కమిటీకి అభినంద నలు తెలిపారు. ఐక్యతతో ముందుకు సాగుతూ సంఘ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని పేర్కొ న్నారు. “సంఘటిత శక్తితోనే అభ్యున్నతి - ఐక్యతతోనే హక్కుల సాధన” అనే నినాదంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# సకాలంలో ధాన్యం కొనుగోళ్లు జరుగాలి

**అదనపు కలెక్టర్ వెంకారెడ్డి.**

**మోత్కూర్, మే 02,( వెలుతురు న్యూస్ )**



కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వీలైనంత తొందరగా మిల్లులకు తరలించి దిగు మతులు పూర్తి చెయ్యాలని, ఎక్కడైనా ఆలస్యం లేదా తూకంలో అక్రమ కోతలు విధిస్తే బాధ్యుల పై కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకారెడ్డి హె చ్చరించారు. శనివారం మోత్కూర్ మున్సిపాలి టీలోని ఒక రైస్ ఇండస్ట్రీలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించిన ఆయన, ధాన్యం దిగుమతి ప్రక్రియ, స్టాక్ వివరాలను పరిశీలించారు. మిల్లుల యా జమాన్యాలు ధాన్యం దిగుమతులలో ఎలాంటి కోతలు విధించకుండా, రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వెంట వెంటనే దిగుమతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. దిగుమతుల్లో ని ర్లక్ష్యం, ఆలస్యం చోటుచేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన ధాన్యాన్ని రోజులు గడపకుండా వెంటనే వాహనాల ద్వారా మిల్లు లకు తరలించాలని అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. మిల్లుల యాజమాన్యా లు ధాన్యం తూకంలో కోతలు విధించకుండా ది గుమతులు చేసుకోవడం లేదని వస్తున్న వార్తల పై స్పందిస్తూ, ఎక్కడైనా ఇలాంటి సమస్యలు తలెత్తితే వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారని సమాచారం.ఈ తనిఖీ కార్యక్ర మంలో డీసీఎస్ఓ రోజారమణి, డీటీ నర్సింగ్ రావు, ఎంఆర్ఐ సుమన్, జీపీఓ జగన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **ఎమ్మెల్యే వేముల వీరేశం కి వినతి పత్రం అందజేత**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలి అంటూ కార్మికుల వినతి**

**నార్కట్ పల్లి వెలుతురు మే 02:**



శనివారం రోజు నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపో జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం గారిని కలిసి ఆర్టీసీ కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సం దర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయుటకు అంగీకారం కుదిరిన నేపథ్యంలో 32 సమస్యల ను పరిష్కరించేందుకు విధివిధానాలు రూపొం దించాలని ఆదేశించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. కార్మికుల పక్షపాతిగా ఉన్న ప్రభుత్వా నికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, నార్క ట్‌పల్లిలో నిర్వహించనున్న విజయోత్సవ సభకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం ని జేఏసీ నాయకులు ఆహ్వానించారు.

నార్కట్‌పల్లి డిపోలో కార్మికులు తీవ్రమైన పని ఒత్తిడికి గురవుతున్నారని జేఏసీ పేర్కొంది. రోజుకు 16 నుండి 17 గంటలపాటు విధులు నిర్వర్తించాల్సి వస్తోందని, చేసిన అదనపు పనికి సరైన పారితోషికం అందడం లేదని కార్మికులు వాపోతున్నారు. ముఖ్యంగా, ఇతర డిపోలతో పోలిస్తే నార్కట్‌పల్లి డిపోలో ఆర్డినరీ సర్వీసుల కి లోమీటర్లు అత్యధికంగా ఉన్నాయని తెలిపారు. నల్గొండ డిపోలో 388 కిలోమీటర్లకు స్పెషల్ ఆఫ్ డ్యూటీ ఇవ్వగా, నార్కట్‌పల్లి డిపోలో 468 కిలో మీటర్లు పనిచేయమని ఒత్తిడి తెస్తున్నారని ఆరో పించారు. ఉదయం 5 గంటలకు విధుల్లో చేరి రాత్రి 9 గంటల వరకు పని చేయాల్సి వస్తోందని, దీనికి తోడు అధికారులు వేధింపులకు గురిచేస్తు న్నారని కార్మికులు తెలిపారు. డీఎం కార్యాలయం మరియు సెక్షన్ కార్యాలయాలలో కొంతమంది అధికారులు అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని కూడా ఆందోళన వ్యక్తం చేశారు. విజయోత్సవ సభకు ముందే కిలోమీటర్ల సమస్యను పరిష్క రించి, అధికారుల ప్రవర్తనలో మార్పు తీసుకు రావాలని జేఏసీ డిమాండ్ చేసింది. లేకపోతే, మరో దశ ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ఆర్టీసీ అధికారులపై ఒత్తిడి తెస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు.

# అమరావతి ఆకాశహర్మ్యాల కల సాకారం






- **- రూ.1208 కోట్లతో ‘ట్విన్ టవర్స్’ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్**
- **- క్వాంటం వ్యాలీలో ఆకాశహర్మ్యాల నిర్మాణం**
- **- ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులు**
- **- ఏప్రిల్ 23న జరిగిన ఏపీసీఆర్‌డీఏ సమావేశ నిర్ణయానికి కార్యరూపం**
- **- డిజైన్ బిల్డ్ లంప్సమ్ పద్ధతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం**
- **- తక్షణమే టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని ఏజీఐసీఎల్‌కు ఆదేశాలు**
- **- ఐటీ, వాణిజ్య రంగాలకు గుండెకాయలా నిలవనున్న కొత్త టవర్లు**
- **- అమరావతి నిర్మాణ పనుల్లో వేగం**
- **- ఊపందుకోనున్న రియల్ ఎస్టేట్**
- **- గ్లోబల్ సిటీ లక్ష్యం దిశగా ఏపీ సర్కార్ మరో చారిత్రాత్మక ముందడుగు**

**అమరావతి మే 2 (వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం అమరావతిని ప్ర పంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్ర భుత్వం మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. రాజధానిలోని క్వాంటం వ్యాలీలో అత్యాధునిక హంగులతో నిర్మించనున్న ఐకానిక్ ‘ట్విన్ ఆఫీస్ టవర్ల’ నిర్మాణానికి అధికారికంగా పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. ఈ భారీ ప్రాజె క్టు ద్వారా రాజధాని ప్రాంతంలో పరిపాలనా యం త్రాంగానికి అవసరమైన అంతర్జాతీయ స్థాయి కా ర్యాలయ వసతిని కల్పించడమే కాకుండా, నగరం యొక్క ప్రతిష్ఠను ప్రపంచ పటంలో చాటిచెప్పాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు మున్సిపల్ పరి పాలన శాఖ కీలక ఉత్తర్వులను జారీ చేసింది.

*నిధుల మంజూరు ప్రాజెక్టు వివరాలు*

రాజధాని నగరం అమరావతిలో మౌలిక సదుపా యాల కల్పనను వేగవంతం చేస్తూ, ట్విన్ టవర్ల ‘షెల్ అండ్ కోర్’ నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం రూ. 1208.41 కోట్లను కేటాయించింది. గత నెల (ఏప్రిల్) 23వ తేదీన జరిగిన 60వ ఏపీసీ ఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ సమావేశ నిర్ణయాల మేరకు ఇప్పుడు నిధుల విడుద లకు మార్గం సుగమమైంది.క్వాంటం వ్యాలీ వంటి వ్యూహాత్మక ప్రాంతంలో ఈ టవర్లను నిర్మించడం వల్ల భవిష్యత్తులో ఐటీ దిగ్గజ సంస్థలకు ఇవి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

*పారదర్శక టెండర్ల విధానం*

ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ‘డిజైన్ బిల్డ్ లంప్సమ్’ పర్సంటేజ్ టెండర్ విధానంలో చేపట్టాలని ప్రభు త్వం నిర్ణయించింది. ఈ విధానం ద్వారా ఎంపికైన నిర్మాణ సంస్థే ప్లానింగ్, డిజైనింగ్ మరియు నిర్మాణ బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహించాల్సి ఉంటుంది. దీనివల్ల పనుల్లో నాణ్యత పెరగడమే కాకుండా, నిర్ణీత కాలపరిమితిలో ప్రాజెక్టు పూర్త య్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నా రు. ఈ మేరకు అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్ర క్చర్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. టెండర్ల ప్రక్రియను యుద్ధ ప్రాతిపది కన ప్రారంభించాలని, ఏజీఐసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ పనులను నేరుగా పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

*అమరావతికి ఐకానిక్ గుర్తింపు*

అమరావతిని కేవలం పరిపాలనా నగరంగానే కాకుండా ఒక గ్లోబల్ బిజినెస్ హబ్‌గా మార్చా లన్నది ప్రభుత్వ ప్రధాన సంకల్పం. క్వాంటం వ్యాలీలో నిర్మించే ఈ ట్విన్ టవర్లు రాజధానికే తలమానికంగా నిలవనున్నాయి. ఇక్కడ కేవలం ప్రభుత్వ కార్యాలయాలే కాకుండా, అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాలకు కూడా చోటు కల్పించ నున్నారు. ఈ నిర్ణయంతో రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగానికి మళ్లీ కొత్త వెలుగులు రానున్నాయి. వెయ్యి కోట్లకు పైగా నిధులతో చేప ట్టిన ఈ భారీ నిర్మాణం రాజధాని నిర్మాణ పనుల్లో కొత్త జోష్ నింపడమే కాకుండా, వేలాది మందికి ఉపాధి అవకాశాలను కూడా కల్పించనుంది.ప్రభు త్వ తాజా నిర్ణయంతో అమరావతి అభివృద్ధి మరో ఉన్నత స్థాయికి చేరుకోనుంది.

## నాగార్జున స్కూల్ కు - మోస్ట్ ప్రామిసింగ్ స్కూల్ అవార్డు




**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 02:**

వైందం కలంగ్,మలేషియాలో గ్లోబల్ ట్రింఫ్ ఫౌండేషన్ మరియు బ్రిక్స్ ఏషియన్ బిజినెస్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ 2026 లో రామన్న పేట మండల కేంద్రంలోని నాగార్జున స్కూల్ మోస్ట్ ప్రామిసింగ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డును మలేషియా యూనివర్సిటీ ప్రొ ఫెసర్ చేతుల మీదుగా నాగార్జున స్కూల్ కరెస్పాండంట్ డాక్టర్ నాగరాజు నకిరేకంటి మరియు ప్రిన్సిపల్ రేఖ బెస్ట్ ప్రిన్సిపల్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంద న్నారు స్కూల్ సిబ్బంది,మిత్రులు అభినంద నలు తెలిపారన్నారు.

## విద్యుత్ వినియోగంపై అవగాహన కార్యక్రమం



**గుండాల మే 2 (వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం లోని పెద్దపరిశాల గ్రామంలో 33/11kv సబ్ స్టేషన్ లో విద్యుత్ భద్రత వారోత్సవాల కార్యక్ర మం జరిగింది ఈ కార్యక్రమంలో పెద్ద పడిశాల సర్పంచ్ రణమల్ల అనిత శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ సేఫ్టీ గురించి విద్యుత్ కార్మికులకు ప్రజలకు రైతులకు విద్యుత్తు వినియోగం వాటి వాడకం జరిగే ప్రమాణాల గురించి వివరించారు రైతులు వ్యవసాయబాల వద్ద విద్యుత్తు వారు తెగిపడిన పరిసర ప్రాంతా లకు గాని పశువులకు గాని ఎలాంటి ఆపద ఏర్పడిన సంబంధిత విద్యుత్ అధికార తెలియ జేసిన వెంటనే ఆ ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలువేస్తారని అన్నారు. . ప్రజలకు నిత్యవసర వస్తువుల్లో భాగమైన విద్యుత్ త్రాగునీరు ఇతర అంశాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్ర మంలో ఎస్ ఎల్ ఐ నరసయ్య. లైన్మెన్ బిక్షపతి. అసిస్టెంట్ లైన్మెన్ శేఖర్. సోమయ్య. వెంకన్న. హైమద్. తదితరులు పాల్గొన్నారు

## ఏపీలో ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం



**విజయవాడ , మే 2 (వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యావరణ హిత రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడానికి రూ. 250 కోట్లతో ప్ర త్యేక నిధిని ఏర్పాటు చేసింది. ఈ నిధి ద్వారా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం తో పాటు, కాలుష్య రహిత రవాణా నెట్‌వ ర్క్‌ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2047 నాటికి కార్బన్ ఉద్గారాలను సున్నాకి చేర్చాలనే (నెట్ జీరో) బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ఈ అడుగులు వేస్తోంది.

*ఐదు నగరాలకు ఐదు విభిన్న ప్రణాళికలు*

పురపాలక పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి స్పష్ట మైన మార్గదర్శకాలను విడుదల చేసింది. విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్ర వరం, నెల్లూరు, తిరుపతి నగరాలను ఈవీ హబ్‌లుగా తీర్చిదిద్దనున్నారు. ప్రతి నగరానికి రూ. 50 కోట్ల చొప్పున కేటాయించి, అక్కడ స్థానిక అవసరాలకు తగ్గట్టుగా ఈవీ నెట్‌వ ర్క్‌ను అభివృద్ధి చేస్తారు. విశాఖలో పర్యాటక ప్రాంతాలకు ఎలక్ట్రిక్ వాహనాలను అనుసం ధానిస్తుండగా, విజయవాడలో లాజిస్టిక్స్ మరియు రవాణా మార్గాలను గ్రీన్ కారిడార్లు గా మారుస్తారు.

*అణువణువునా ఛార్జింగ్ సౌకర్యం*

ఎలక్ట్రిక్ వాహనాల వాడకందారులకు ఎదు రవుతున్న ప్రధాన సమస్య ఛార్జింగ్. దీనిని పరిష్కరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళిక సిద్ధం చేసింది. నగరాల్లో ప్రతి 9 కిలోమీటర్ల పరిధిలో ఒక ఛార్జింగ్ పాయింట్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇక అంతరాష్ట్ర మరియు అంతర జిల్లా రహదారులపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒకసారి ఛార్జింగ్ లేదా బ్యాటరీ మార్పిడి కేంద్రాలను ఏర్పాటు చే యనున్నారు. ఇది వాహనదారుల్లో ధైర్యాన్ని నింపడమే కాకుండా, దూర ప్రయాణాలకు ఈవీలను వాడేలా ప్రోత్సహిస్తుంది.

*వినూత్నంగా నదీ, సరుకు రవాణా*

ఈ ప్రణాళిక కేవలం రోడ్డు రవాణాకే పరిమితం కాలేదు. రాజమహేంద్రవరంలో గోదావరి నదిపై ఎలక్ట్రిక్ నదీ రవాణా వ్య వస్థను ప్రవేశపెట్టి వ్యవసాయ ఉత్పత్తుల రవాణాను సులభతరం చేయనున్నారు. నె ల్లూరులో చేపల రవాణా కోసం ప్రత్యేక ఈవీ లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను కల్పించ నున్నారు. తిరుపతిలో తిరుమలకు వెళ్లే షటిల్ సర్వీసులను పూర్తిగా విద్యుదీకరించి, పుణ్య క్షేత్ర పవిత్రతను మరియు పర్యావరణాన్ని కాపాడనున్నారు.

భవిష్యత్తు తరాలకు హరిత ఆంధ్ర

పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ, ఈ నిధి వినియోగం ద్వారా రాష్ట్రం ఈ మొబిలిటీ రంగంలో కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం వాహనాల కొనుగోలే కాకుండా, విద్యుత్ గ్రిడ్‌లను బలోపేతం చేయడం, కొత్త సాంకేతికతలను ప్రయోగా త్మకంగా అమలు చేయడం వంటి పనులు ఈ నిధితో చేపడతారు. ఈ చర్యల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు పెరగడమే కాకుండా, కాలుష్యం తగ్గి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని విశ్లేషకులు భావిస్తున్నా రు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర సుస్థిర అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా నిలవనుంది.

## సమాచార భారతి ఆధ్వర్యంలో నారద మహర్షి జయంతి వేడుకలు



**కరీంనగర్ వెలుతురు మే 02:**
కరీంనగర్ సమాచార భారతి ఆధ్వర్యంలో శనివారం రోజున దేవర్షి నారద మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ ప్రచార ప్రముక్ తడిగొప్పుల శంకరయ్య జి ముందుగా దేవర్ష నారద మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. మే 2 (వైశాఖ జేష్ట కృష్ణ పక్ష ప్రతిపద) న నారద జయంతిని ఆర్ఎస్ఎస్, విశ్వసంవాద కేంద్రం పాత్రికేయుల దినోత్సవం గా జరుపుకుంటుందని తెలిపారు. ముఖ్యంగా ముల్లోకాలను సంచరించి సమాచార వ్యాప్తి కోసం పనిచేసిన మొట్టమొదటి పాత్రికేయుడు నారద మహర్షి అని కొనియాడారు. నారదుడు సమాచారాన్ని ముఖ్యంగా లోక కళ్యాణం కోసం ఒక చోట నుండి మరొక చోటికి చేరవేసేవారని, ఈ నేపథ్యంలో వార్తలను సత్య నిష్ఠతో అందించే పాత్రికేయులకు ఆయనను ఆదర్శంగా భావిస్తారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. ముఖ్యంగా పంచ పరివర్తన్ విషయాలను సమాజంలోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తుందని వివరించారు. అలాగే దేశవ్యాప్తంగా హిందూ సమ్మేళన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బాధ్యులు గీకురిశ్రీనివాస్, వేణుగోపాల్ , గజ్జెల హరికాంత్ లతోపాటు పలువురు ప్రాతికేయలు పాల్గొన్నారు.

## గణపతి దేవాలయ 16వ వార్షికోత్సవం

**సిద్దిపేట వెలుతురు మే 02:**
సిద్దిపేట లోని శ్రీ సిద్ది బుద్ది దేవీ సహిత మహా గణపతి దేవాలయ 16వ వార్షికోత్సవాలు ర్వహించనున్నారు.ఈ నెల నాలుగు నుంచి రెండు రోజుల పాటు వార్షికోత్సవాలు జరుగుతాయి 4న ఉదయం ఏడు గంటలకు అభిషేకం, పుణ్యహవచనం, కళశ స్థాపన, స్థాపిత దేవతా హోమాలు నిర్వహిస్తారు. అంగారక చతుర్థి నేపథ్యంలో 5 సాయంత్రం చెరుకు రసం తో స్వామి వారికీ అభిషేకం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు చెరుకు రసం తో తీసుకరావాల్సి ఉంటుంది. విశేష అలంకరణ, పూజ కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవతానుగ్రహం పొందాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా విద్యానగర్ బస్తీ హిందూ సమ్మేళనం...




**కరీంనగర్ వెలుతురు న్యూస్ మే 02:**
ఆర్ ఎస్ ఎస్ శతాబ్ది కార్యక్రమాల్లో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించబడుతున్న హిందూ సమ్మేళన కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున కరీంనగర్ పట్టణంలోని విద్యానగర్ బస్తి (విద్యానగర్, కురుమవాడ , హిందూపురి కాలనీ ) హిందూ సమ్మేళనం కొత్త యాస్వాడలో గల వెటర్నరీ పాలిటేక్నిక్ కాలేజీ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీర ధర్మజ మజా స్వామీజీ, ప్రధాన వక్త జిన్నా సత్యనారాయణ రెడ్డి, మహిళా వక్త కంజర్ల శ్రీలత ఉత్సవ సమితి అధ్యక్షులు గోవిందరావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త జిన్నా సత్యనారాయణ రెడ్డి , మహిళా వక్త కంజర్ల శ్రీలత లు మాట్లాడుతూ మాట్లాడుతూభారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శంగా ఉందన్నారు. కుటుంబ వ్యవస్థ సామాజిక సమరసతకు, సంస్కృతికి, ధర్మ బద్ధ జీవనానికి , సామాజిక జీవనానికి నాంది కాబట్టి కుటుంబ వ్యవస్థను కాపాడు కోవాలన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించబడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని భారత దేశ సేవ, సమాజ సేవలో లో కోట్లాది మందికి ప్రేరణగా నిలుస్తుందని, ఆర్ఎస్ఎస్ లోని ఎన్నో సంస్థలు దేశ హితం కోసం, ధర్మ సంస్కృతి , సాంప్రదాయాల పరిరక్షణ కోసం పనిచేస్తూ ముందు కు కొనసాగుతుందన్నారు. . మన సంస్కృతి సంప్రదాయాలుకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని,మన సంస్కృతిని మన భాషని మన జీవన విలువలని కాపాడుకుంటూ మన యొక్క దేశ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ముఖ్య అతిథి వీరధర్మజ మజా స్వామీజీ మాట్లాడుతూ హిందూత్వము మన కట్టు బొట్టు మన యొక్క పండుగలు మన ఆచార వ్యవహారాల్లో ఉందని, ప్రతి హిందువు భగవద్గీతను మన గోవుని మన దేవాలయాలని కాపాడుకుంటూ మన సంస్కృతిని ముందుకు తీసుకు వెళ్లడానికి కృషి చేయాలి అన్నారు..ఈ సమ్మేళనంలో గోపూజ కార్యక్రమం హనుమాన్ చాలీసా పారాయణము , భజన సంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు.

## స్నేహానికి నిదర్శనం ... మృత మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన 10వ తరగతి మిత్రులు

- **కష్టకాలంలో తోడుగా ఉంటామని మాటిచ్చిన 2003–04 బ్యాచ్ క్లాస్‌మేట్స్...**



**జహీరాబాద్ వెలుతురు మే 02:**
సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం చింతల గట్టు గ్రామంలో హృదయాన్ని తాకే ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహమ్మద్ సర్వర్ ఇటీవల హార్ట్ స్ట్రోక్‌తో ఆకస్మికంగా మృతి చెందాడు. కుటుంబానికి అతడే ప్రధాన ఆదారం కావడంతో భార్యతో పాటు నలుగురు చిన్నారులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కుటుంబం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ దుర్వార్త తెలుసుకున్న సర్వర్ 10వ తరగతి స్నేహితులు వెంటనే స్పందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. తమకు తోచినంతగా విరాళాలు సేకరించి శుక్రవారం రాత్రి మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సర్వర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పి అండగా నిలిచారు. అంతేకాకుండా భవిష్యత్తులో కూడా ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని, తమ వంతు సహాయం ఎల్లప్పుడూ కొనసాగుతుందని మిత్రులు హామీ ఇచ్చారు. కష్టకాలంలో స్నేహితులు ముందుకు రావడం నిజమైన స్నేహబంధానికి నిదర్శనమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ సహాయక కార్యక్రమంలో దిగ్వాల్ లో చదువుకున్న 2003-2004 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, చింతలగట్టు గ్రామ సర్పంచ్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. స్నేహితుల ఈ సహాయం మృతుడి కుటుంబానికి కొంత ఊరటను కలిగించగా, సమాజంలో మానవత్వం ఇంకా నిలిచివుందని మరోసారి నిరూపించింది.

## అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- **టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి.**






**సంగారెడ్డి వెలుతురు మే 02:**
అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని టీజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్ లో నియోజకవర్గస్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహిళలకు ఉచితంగా మహాలక్ష్మి పేరుతో ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ కలెక్షన్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు 195.18 కోట్ల విలువైన బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్డివో జ్యోతి, ఆర్డిఓ రాజేందర్, సంగారెడ్డి , సదాశివపేట మున్సిపల్ చైర్మన్లు కూన వనిత, అంజమ్మ, మున్సిపల్ కౌన్సిలర్ లు ,సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్ రెడ్డి, శివాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్నికల వెంటనే ధరల పెంపు... కేంద్రంపై విమర్శల వెల్లువ

- **మాజీ చైర్మన్ వై. నరోత్తం ఆగ్రహం**




**జహీరాబాద్ వెలుతురు మే 02:**
కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను ఒక్కసారిగా సుమారు రూ.1000 వరకు పెంచడం వల్ల సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడిందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం విమర్శించారు. ముఖ్యంగా హోటల్ యజమానులు, చిన్న చిన్న వీధి వ్యాపారులు ఈ పెంపుతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రజలను మోసం చేసినట్లేనని ఆయన ఆరోపించారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే గ్యాస్ సిలిండర్ ధరను రూ.1300కు పైగా పెంచడం దారుణమని అన్నారు. దేశంలో ఇంధన నిల్వలకు ఎలాంటి కొరత లేదని చెబుతూనే, ఇలా భారీగా ధరలు పెంచడం కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన సమయంలో, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల భారాన్ని మోపడం ఆందోళనకరమని చెప్పారు. ఇప్పటికే రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, గృహిణులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న ఆయన, కేంద్ర ప్రభుత్వం వెంటనే వాణిజ్య గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

## ఇటుక బట్టిపై సడెన్ రైడ్ – బాలకార్మికంపై జడ్జి కఠిన హెచ్చరిక

- **పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం**



**జహీరాబాద్ వెలుతురు మే 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల కేంద్రంలో బాలకార్మికంపై అప్రమత్తత పెంచే దిశగా కీలక చర్యలు తీసుకున్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ ఆధ్వర్యంలో అర్జున్నాయక్ తండా సమీపంలోని ఇటుక బట్టిపై జహీరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి జి. కవిత దేవి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బట్టిలో పనిచేస్తున్న పరిస్థితులను స్వయంగా పరిశీలించిన జడ్జి, అక్కడ ఉన్న చిన్నారులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. పిల్లలు ఇటుకలను లారీల్లో ఎక్కించడంలో సహాయం చేస్తున్నామని వెల్లడించారు. దీనిపై స్పందించిన జడ్జి, తల్లిదండ్రులను ప్రశ్నించగా, ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు ఉన్నందున పిల్లలు తమ వద్దే ఉంటున్నారని చెప్పారు. అయితే పిల్లలను ఏ విధంగానైనా పనిలో నిమగ్నం చేయడం బాలకార్మిక నిరోధక చట్టానికి విరుద్ధమని స్పష్టం చేశారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జరిమానాలు మరియు శిక్షలు తప్పవని జడ్జి హెచ్చరించారు. చిన్నారుల విద్య, భవిష్యత్తు దృష్ట్యా వారికి పనుల నుంచి దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు.

## మున్సిపల్ వర్కర్స్ సమ్మె 2వ రోజు – PF, ESI వెంటనే జమ చేయాలంటూ హెచ్చరిక

- **చర్యలు లేకుంటే ఉద్యమం ఉదృతం చేస్తామని CITU నేతల అల్టిమేటం**




**జహీరాబాద్ వెలుతురు మే 02:**
మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరుకుంది. పెండింగ్‌లో ఉన్న PF, ESI చెల్లింపులను తక్షణమే జమ చేయాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని CITU జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహిపాల్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, PF, ESI చెల్లింపులు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆర్థికంగా మరియు మానసికంగా బాధపడుతున్నారని తెలిపారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు అందాల్సిన సబ్బులు, నూనెలు, యూనిఫామ్‌లు, షూస్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా కల్పించాలని కోరారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక్క పూట డ్యూటీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే, ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో CITU యూనియన్ నాయకులు సంజీవ్, మోహన్, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్లలో 'టింగ్ టింగ్' మంటూ డేంజర్ సైరన్




- ఆందోళన వద్దు.. ఇది కేంద్రం చేస్తున్న భారీ విపత్తు పరీక్ష
- - దేశవ్యాప్తంగా 'సెల్ బ్రాడ్ కాస్ట్ అలర్ట్ సిస్టమ్' ప్రయోగాత్మక పరీక్ష
- - అలర్ట్ సందేశం వచ్చినప్పుడు మొబైల్‌లో పెద్ద బీప్ సౌండ్ - యూజర్ల షాక్
- - తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో స్క్రీన్‌పైకి ఫ్లాష్ మెసేజ్‌లు
- - ఒకటికంటే ఎక్కువసార్లు సైరన్ మోగే అవకాశం - విస్మరించాలని సూచన
- - విపత్తు నిర్వహణలో స్వదేశీ సాంకేతికత.. కేంద్రం ముందడుగు
- - ఏపీలోని అమరావతి రీజియన్‌లోనూ కొనసాగుతున్న ట్రయల్ రన్
- - ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు ఈ వ్యవస్థ అత్యంత కీలకం
- - కేవలం వ్యవస్థ పనితీరు పరిశీలనకే.. యూజర్లు ఏమీ చేయనక్కర్లేదు

**హైదరాబాద్ వెలుతురు మే 02:**

దేశవ్యాప్తంగా మొబైల్ వినియోగదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. శనివారం ఉదయం నుంచి వేలాది మంది ఫోన్లకు పెద్ద శబ్దంతో కూడిన హెచ్చరిక సందేశాలు రావడమే దీనికి కారణం. అయితే, ఇది చూసి ప్రజలెవరూ భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని కేంద్ర సమాచార శాఖ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ స్పష్టం చేశాయి. విపత్తుల సమయంలో ప్రజలను తక్షణమే అప్రమత్తం చేసేందుకు ఉద్దేశించిన 'సెల్ బ్రాడ్ కాస్ట్ అలర్ట్ సిస్టమ్'ను పరీక్షించడంలో భాగంగానే ఈ మెసేజ్‌లు పంపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. శనివారం ఉదయం నుంచి ఫోన్లకు వస్తున్న ఆ సందేశం ఏంటి? చాలా మంది మొబైల్ స్క్రీన్లపై 'ఎమర్జెన్సీ అలర్ట్: సివియర్' అనే హెచ్చరిక ప్రత్యక్షమవుతోంది. దీనితో పాటు అత్యంత తీవ్రమైన శబ్దం వినిపిస్తోంది. ఆ మెసేజ్‌లో.. "ఇది భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ విభాగం ద్వారా పంపబడిన నమూనా పరీక్ష సందేశం. దయచేసి దీనిని విస్మరించండి. మీ వైపు నుండి ఎటువంటి చర్య అవసరం లేదు" అని స్పష్టంగా పేర్కొంటున్నారు. అప్రమత్తమైన పౌరులు, సురక్షితమైన దేశం అనే నినాదంతో ఈ సిస్టమ్‌ను కేంద్రం పరీక్షిస్తోంది.

*ఎందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు?*

భవిష్యత్తులో సంభవించే తుపానులు, భూకంపాలు, వరదలు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను నిమిషాల వ్యవధిలో హెచ్చరించేందుకు ఈ వ్యవస్థను రూపొందించారు. రేడియో, టీవీల కంటే వేగంగా, నేరుగా ప్రజల జేబులో ఉండే మొబైల్‌కే సమాచారాన్ని చేరవేడమే దీని లక్ష్యం. నెట్‌వర్క్ జాప్యం లేకుండా, ఇంటర్నెట్ లేకపోయినా పనిచేసేలా ఈ సెల్ బ్రాడ్ కాస్ట్ టెక్నాలజీని డిజైన్ చేశారు. ఈ ట్రయల్ రన్ ద్వారా నెట్‌వర్క్ సామర్థ్యాన్ని, అలర్ట్‌లు చేరే వేగాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు.

*ఎన్నిసార్లు వస్తుంది? అందరికీ వస్తుందా?*

ఈ టెస్టింగ్ ప్రక్రియలో భాగంగా ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువసార్లు కూడా అలర్ట్ సైరన్లు వచ్చే అవకాశం ఉందని టెలికం విభాగం తెలిపింది. కొంతమందికి మెసేజ్ వచ్చిన వెంటనే ఫోన్ వైబ్రేట్ అవ్వడమే కాకుండా, సైలెంట్ మోడ్‌లో ఉన్నా కూడా శబ్దం వచ్చే అవకాశం ఉంది. ఇది కేవలం వ్యవస్థ పనితీరును సరిచూడడమే కాబట్టి, ఎవరూ కంగారు పడి అధికారులకు ఫోన్ చేయాల్సిన అవసరం లేదని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.

*విపత్తు కాలంలో ప్రాణరక్షణ కవచం*

భారతదేశం విపత్తుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఎంఏ భావిస్తోంది. గతంలో విపత్తు వచ్చినప్పుడు సమాచారం చేరకముందే ప్రాణ నష్టం జరిగేది. కానీ ఈ కొత్త సిస్టమ్ ద్వారా క్షణాల్లో లక్షలాది మందికి హెచ్చరికలు పంపవచ్చు. ప్రాణ, ఆస్తి నష్టాలను భారీగా తగ్గించడంలో ఈ 'టింగ్ టింగ్' శబ్దం భవిష్యత్తులో కీలక పాత్ర పోషించనుంది. ప్రజలు ఈ సాంకేతిక ప్రయోగానికి సహకరించాలని, తమ ఫోన్లకు వచ్చే సందేశాలను కేవలం పరీక్షగా మాత్రమే భావించాలని కేంద్రం మరోసారి విజ్ఞప్తి చేసింది.

# మే 10న మోదీ సభకు భారీ సన్నాహాలు




- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ విజయవంతం లక్ష్యం
- రంగారెడ్డి జిల్లాలో బీజేపీ సమావేశం, కార్యకర్తలకు లక్ష్మణ్ పిలుపు

**రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 02:**

మే 10న హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వద్ద నిర్వహించనున్న ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి రంగారెడ్డి జిల్లాలో బీజేపీ సన్నాహక సమావేశం నిర్వహించింది. సభ ఏర్పాట్లు, జన సమీకరణపై ఈ సమావేశంలో నేతలు చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె లక్ష్మణ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి బూత్ నుంచి భారీగా ప్రజలను సమీకరించి సభను చారిత్రాత్మకంగా మార్చాలని సూచించారు. తెలంగాణలో బీజేపీ శక్తిని చాటి చెప్పే అవకాశమిదేనని అన్నారు.



మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి బాటలో దూసుకెళ్తోందని, అదే దిశగా తెలంగాణను కూడా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. సభను విజయవంతం చేయడం ద్వారా రాష్ట్రంలో పార్టీ బలం మరింత పెరుగుతుందని తెలిపారు.

# శీతలీకరించిన కాన్కోర్ కంటైనర్ రేక్- 'ఔషధి ఎక్స్‌ప్రెస్' ప్రారంభం


- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సంజయ్ స్వరూప్‌తో కలిసి రిఫ్రిజిరేటెడ్ కంటైనర్ రేక్‌ను జెండా ఊపి ప్రారంభించారు

**హైదరాబాద్ వెలుతురు మే 02:**

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (కాన్కోర్) చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సంజయ్ స్వరూప్‌తో కలిసి, ఈ రోజు అనగా 2 మే, 2026న సనత్‌నగర్‌లోని ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో (ఐ.సి.డి) నుండి ప్రారంభ రిఫ్రిజిరేటెడ్ (రీఫర్) కంటైనర్ రేక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే పి.సి.ఓ.ఎమ్ శ్రీమతి కె. పద్మజ; దక్షిణ మధ్య రైల్వే పిసిసిఎం, శ్రీమతి ఇటి పాండే; సికింద్రాబాద్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ ఆర్. గోపాలకృష్ణన్; దక్షిణ మధ్య రైల్వేకు చెందిన సీనియర్ రైల్వే అధికారులు; కాన్కోర్ & మెర్స్క్ నుండి అధికారులు, లాజిస్టిక్స్ భాగస్వాములు మరియు కీలక వాటాదారులు కూడా పాల్గొన్నారు.

"ఔషధి ఎక్స్‌ప్రెస్" అనే బ్రాండ్‌తో ఉన్న ఈ శీతలీకరించిన (రీఫర్) కంటైనర్‌ను, జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ (జె.ఎన్.పి.టి)కు కాన్కోర్ సంస్థ నడుపుతోంది. ఈ సేవ ప్రత్యేకంగా ప్రాణరక్షక ఔషధాలు మరియు ఇతర ఉష్ణోగ్రతకు సున్నితమైన సరుకులను సురక్షితంగా రవాణా చేయడానికి రూపొందించబడింది. అధునాతన రీఫర్ కంటైనర్లలో డీజిల్ పవర్ ప్యాక్‌లు అమర్చబడి ఉండటం వలన, ప్రయాణమంతా నిరంతర శీతలీకరణ కొనసాగుతుంది. ఈ శీతలీకరించిన కంటైనర్ సేవ, కోల్డ్‌చైన్ అనుసంధానాన్ని బలోపేతం చేయడానికి మరియు భారతదేశ ఫార్మాస్యూటికల్ సరఫరా గొలుసు సామర్థ్యాన్ని పెంచడానికి ఒక ప్రధాన ముందడుగుగా నిలుస్తోంది . అధిక నాణ్యత గల రీఫర్ కంటైనర్లను అందిస్తున్న మెర్స్క్ లైన్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం, ఐసిడి సనత్‌నగర్ యొక్క కోల్డ్‌చైన్ లాజిస్టిక్స్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుంది. హైదరాబాద్ భారతదేశంలోని అతిపెద్ద ఫార్మాస్యూటికల్ కేంద్రాలలో ఒకటి మరియు దీనిని తరచుగా " భారతదేశ ఫార్మా రాజధాని" అని పిలుస్తారు. హైదరాబాద్‌లోని కీలక ఫార్మా ప్రాంతాలలో జీనోమ్ వ్యాలీ (తుర్కపల్లిలో ఉన్న ఒక ప్రధాన ఆర్&డి కేంద్రం ), జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం, పటాన్‌చెరు (ఒక పారిశ్రామిక ఫార్మా జోన్), మరియు ముచర్ల ఉన్నాయి . హైదరాబాద్-జేఎన్‌పీటీ కారిడార్, తెలంగాణ పారిశ్రామిక ప్రాంతాలకు మరియు భారతదేశంలోని అత్యంత రద్దీగా ఉండే ఓడరేవులలో ఒకటైన జేఎన్‌పీటీతో అనుసంధానించే కీలక మార్గంగా పనిచేస్తూ, ఈ ప్రాంత సామాజికఆర్థిక అభివృద్ధికి






తోడ్పడుతోంది.. ఇండియన్ రైల్వేలు ప్రత్యేకంగా ప్రారంభిస్తున్న రీఫర్ రేక్ సేవలు ఎగుమతిదారులు మరియు దేశీయ పంపిణీదారులకు ప్రయోజనకరంగా నిలుస్తాయి. ఇవి ప్రయాణ సమయాన్ని తగ్గించి, లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించి, సరఫరా గొలుసు విశ్వసనీయతను పెంచుతాయి. ఫార్మాస్యూటికల్ ఎగుమతులు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యత పరిరక్షణ అవసరాలు పెరగడంతో భారతదేశంలో విశ్వసనీయమైన కోల్డ్‌చైన్ పరిష్కారాల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను ఈ రీఫర్ రేక్ వినియోగం ప్రతిబింబిస్తుంది. ఇది ఎగుమతిదారులకు నూతన అవకాశాలను సృష్టిస్తుందని, ధరల సాధన మెరుగుపడుతుంది, అలాగే వృథాను తగ్గిస్తుందని భావిస్తున్నారు. ఈ చొరవ, సమర్థవంతమైన, సుస్థిరమైన, మరియు పర్యావరణ అనుకూలమైన సరుకు రవాణా వ్యవస్థలను ప్రోత్సహించే ప్రధానమంత్రి గతి శక్తి పథకం కింద భారత ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా ఉంది.

# ఓఆర్ఆర్ ప్రమాద బాధితులకు కేటీఆర్ నివాళి



- ఉస్మానియా మార్చురీ వద్ద కుటుంబ సభ్యులకు పరామర్శ
- సిరిసిల్లకు తరలిన ఆరుగురు మృతుల భౌతిక కాయాలు

**హైదరాబాద్ వెలుతురు మే 02:**

సిరిసిల్లలో తీవ్ర విషాదాన్ని నింపిన ఔటర్ రింగ్ రోడ్ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం రోజున ఉదయం పరామర్శించారు. నిన్న జరిగిన ఈ ఘోర ప్రమాదంలో సిరిసిల్లకు చెందిన ఆరుగురు వ్యక్తులు మృతి చెందడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీకి చేరుకున్న ఆయన, మృతుల పార్థివ దేహాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘన నివాళులర్పించారు.

అనంతరం, అక్కడ ఉన్న మృతుల కుటుంబ సభ్యులతో కేటీఆర్ గారు మాట్లాడారు. ఆత్మీయులను కోల్పోయి కన్నీరు మున్నీరవుతున్న వారిని ఆయన ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో తాను వ్యక్తిగతంగా బాధిత కుటుంబాలకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒకే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ఇలా అకాల మరణం చెందడం తీరని లోటు అన్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం మరియు ఇతర అధికారిక ప్రక్రియలు పూర్తయిన తర్వాత, ఆరుగురి మృతదేహాలను అంబులెన్స్‌లలో వారి స్వగ్రామమైన సిరిసిల్లకు తరలించారు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాలను తరలించే వరకు కేటీఆర్ గారు అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ విషాద ఘటనతో అటు సిరిసిల్ల నియోజకవర్గంలోనూ, ఇటు ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలోనూ విషాద ఛాయలు అలముకున్నాయి.

# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం - మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**నల్లగొండ వెలుతురు మే 02::**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలే కాకుండా, ప్రజలకు చెప్పని అనేక కొత్త కొత్త పథకాలను అమలు చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భావనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్లో నిర్వహించిన నల్గొండ నియోజకవర్గస్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు గ్రామ ,మండల స్థాయిలో కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు మహిళలకు ఉచిత సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకు ఎల్పిజి గ్యాస్, వంటి ఆరు గ్యారెంటీలను ఇచ్చి అమలు చేస్తున్నదని, అంతేకాక ఇవ్వని వాగ్దానాలు, దేశంలో ఎక్కడా లేనివిధంగా పూర్వ ప్రాథమిక విద్య నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ పరంగా మధ్యాహ్న భోజనం అందించనుందని తెలిపారు. ఉదయం రాగిజావ, మధ్యాహ్నం భోజనం ,సాయంత్రం సమయంలో అల్పాహారం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏదైనా ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని




అమలు చేయనుందని తెలిపారు. ఇది తెలంగాణలో విప్లవాత్మకమైన పథకం అని అన్నారు. ఈ పథకం కింద సంవత్సరంలో 1400 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుందని తెలిపారు .వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉచిత విద్యుత్తు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు అమలు చేయడం జరిగిందని, తిరిగి తమ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉచిత బస్సు పథకం కింద రెండు కోట్ల 86 లక్షలు మంది మహిళలు బస్సులలో తిరగడం జరిగిందని, ఉచిత విద్యుత్ కింద 5000 కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు . నల్గొండ పట్టణంలో రామగిరి టెంపుల్ నుండి దేవరకొండ రోడ్డు వరకు 15 కోట్ల రూపాయలతో రోడ్డును అభివృద్ధి చేస్తున్నామని, జాబ్ మేళా ద్వారా 5000 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాల అవకాశాలు కల్పించి అపాయింట్మెంట్ ఆర్డర్లు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. న్యాక్ కేంద్రం ద్వారా టైలరింగ్, మెకానిక్ ఇతర ట్రేడులలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని, ఇంకా మరిన్ని కోర్సు ప్రవేశపెడతామని తెలిపారు. మహిళలకు ఆసక్తి ఉన్నవారందరికీ ప్రత్యేకించి మిషన్ నేర్చుకున్న వారందరికీ కుట్టు మిషన్లు ఇస్తామని చెప్పారు.

నల్గొండ నియోజకవర్గంలో 740 మంది ఇందిరమ్మ ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఇంకా ఇండ్లు మొదలు పెట్టలేదని, ఈ నెలాఖరు నాటికి చేపట్టిన ఇంద్రమైండ్లన్నీ పూర్తి కావాలని ,ఎవరైనా ఇండ్లు నిర్మించుకునేందుకు ఇష్టం లేనట్లయితే తక్షణమే రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని, అలాంటి జాబితాను సోమవారం నాటికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.అలాంటి వారి స్థానంలో కొత్త లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరుగుతుందని, జూన్ నుండి మరో విడత ఇందిరమ్మ ఇండ్లు పొందేందుకు అనుమతి వస్తుందని, అందువల్ల మే చివరినాటికి నిర్మాణం చేపట్టిన ఇండ్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ఇండ్లను నిర్మించడం జరుగుతున్నదని తెలిపారు. ధాన్యం కొనుగోలులో భాగంగా రైతుల చెల్లింపులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రతి గ్రామం లో ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలతో దగ్గరగా ఉండేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నియోజకవర్గస్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టే కార్యక్రమాలను చదివి వినిపించారు.

అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు.

ఈ సందర్భంగా కల్యాణ లక్ష్మి ,షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది.

డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ , రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మున్సిపల్ కమిషనర్ శరత్చంద్ర పవార్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# 44 జాతీయ పక్షులు మృతి.. కర్ణాటకలో హై అలర్ట్

**కర్ణాటక వెలుతురు మే 02:**

కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో జాతీయ పక్షులైన నెమళ్ల వరుస మరణాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. పచ్చని పొలాల్లో అందంగా విహరించాల్సిన నెమళ్లు అనూహ్యంగా మృతిచెందడం స్థానికుల్లో భయాందోళనలను పెంచుతోంది. ఇప్పటివరకు మొత్తం 44 నెమళ్లు మృత్యువాత పడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై నిర్వహించిన పరీక్షల్లో 'H5N1 బర్డ్ ఫ్లూ' వైరస్ కారణమని ల్యాబ్ రిపోర్టులు నిర్ధారించాయి. ఈ నేపథ్యంలో అధికారులు హై అలర్ట్ ప్రకటించి ప్రభావిత ప్రాంతాలను కట్టడి చేస్తున్నారు. పశుసంవర్ధక శాఖ ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి పర్యవేక్షణ చేపట్టాయి. సమీప గ్రామాల్లో కోళ్లు, ఇతర పక్షులపై కూడా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా



ఉండాలని, అనుమానాస్పదంగా మృతి చెందిన పక్షులను తాకవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి కఠిన చర్యలు కొనసాగుతున్నాయి.

# చెరువుల రక్షణే 'హైడ్రా' లక్ష్యం

**హైదరాబాద్ వెలుతురు మే 02:**




భాగ్యనగరంలోని చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ భూములను కబ్జాకోరుల నుంచి విడిపించడమే ధ్యేయంగా పని చేస్తున్న 'హైడ్రాస తన దూకుడును కొనసాగిస్తోంది. పాతబస్తీలోని ఫాతిమా విద్యా సంస్థల నిర్మాణాలకు సంబంధించి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించేందుకు రెవెన్యూ, నీటి పారుదల శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని కోర్టు సూచించినట్లు ఆయన తెలిపారు. హైకోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తామని, చట్టవిరుద్ధమైన నిర్మాణాలపై కచ్చితమైన నివేదికను సమర్పిస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు.

*రూ. 80 వేల కోట్ల భూములకు విముక్తి*

నగర పర్యావరణాన్ని కాపాడే క్రమంలో హైడ్రా ఇప్పటివరకు అద్భుతమైన ఫలితాలను సాధించిందని రంగనాథ్ వివరించారు. దాదాపు రూ. 80 వేల కోట్ల విలువ చేసే 2,093 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి విడిపించినట్లు తెలిపారు. చెరువులు, పార్కులు అంతరించిపోతుండటం వల్లే నగరంలో అకాల వర్షాలు, తీవ్రమైన వేడిగాలులు వంటి విపరీత పరిణామాలు సంభవిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం హైడ్రా ద్వారా నష్ట నివారణ చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

*పేదల ముసుగులో కబ్జాలు.. డబుల్ బెడ్ రూం ఇళ్ల భరోసా*

హైడ్రా కేవలం పేదల ఇళ్లను మాత్రమే కూలుస్తుందన్న ప్రచారాన్ని కమిషనర్ తీవ్రంగా ఖండించారు. కొంతమంది పెద్దలు, భూకబ్జాదారులు వెనుక ఉండి పేదల ద్వారా ఎఫ్‌టీఎల్ పరిధిలో గుడిసెలు వేయించి, ఆక్రమణలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒకవేళ నిజంగానే నిరుపేదలు చెరువు ప్రాంతాల్లో శాశ్వత నివాసాలు కోల్పోతుంటే, వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని లేదా టీడీఆర్ వంటి వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందని ఆయన వెల్లడించారు.

*చెరువు పట్టాలపై రంగనాథ్ సూటి ప్రశ్న*

బతుకమ్మకుంట ఉదంతాన్ని ప్రస్తావిస్తూ.. ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి చెరువు భూమికి పట్టా ఉందని చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని రంగనాథ్ అన్నారు. "చెరువులో ఉన్న భూమికి పట్టాలు ఎలా వస్తాయి? అక్కడ వ్యవసాయం చేసినంత మాత్రాన ఆ భూమిపై హక్కు రాదు" అని ఆయన స్పష్టం చేశారు. చెరువును పూడ్చి వ్యవసాయం చేసినా, అది రికార్డుల ప్రకారం నీటి వనరుగానే ఉంటుందని వివరించారు. బతుకమ్మకుంట వద్ద కోర్టు ఆదేశాల మేరకు బోర్డులను ఇప్పటికే తొలగించామని, చట్టపరమైన ప్రక్రియను అనుసరిస్తూనే కబ్జాలపై పోరాడతామని చెప్పారు.

*న్యాయస్థానాల ఆదేశాలకు గౌరవం*

న్యాయస్థానాల పట్ల తమకు అత్యంత గౌరవం ఉందని, ప్రతీ కూల్చివేతకు ముందు పక్కా ఆధారాలను కోర్టు ముందు ఉంచుతున్నామని రంగనాథ్ తెలిపారు. ఫాతిమా కళాశాల విషయంలోనూ ఇరిగేషన్ మరియు రెవెన్యూ అధికారులు ఇచ్చే ఉమ్మడి నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని చెప్పారు. అనుమతి లేని నిర్మాణాలు ఎన్ని ఉన్నాయనే వివరాలను కోర్టుకు సమర్పించడమే కాకుండా, ప్రజలందరికీ తెలిసేలా ఆ నివేదికను పబ్లిష్ చేస్తామని వెల్లడించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువులోగా అఫిడవిట్ దాఖలు చేస్తామని, హైడ్రా విధివిధానాల ప్రకారం నగర ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తామని కమిషనర్ పునరుద్ఘాటించారు.

# ప్రగతి పథంలో హుస్నాబాద్ - ప్రజా పాలనతో సకల జనుల సంక్షేమం

- - ప్రగతి ప్రణాళికపై మంత్రి పొన్నం ప్రభాకర్
- - రూ.265 కోట్ల రైతు భరోసా నిధులు
- - 3,515 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు
- - గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి బాధ్యత తనదేనన్న మంత్రి
- - త్వరలోనే భూ నిర్వాసితులకు పరిహారం
- - హుస్నాబాద్‌లో 250 పడకల ఆసుపత్రి
- - మెడికల్ కాలేజీ పీజీ సీట్లతో ప్రారంభం

**హుస్నాబాద్ వెలుతురు మే 02:**





సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపామని పేర్కొన్నారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ, విద్య, వైద్యం, వ్యవసాయం మరియు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి గణాంకాలను మంత్రి వివరిస్తూ.. సుమారు 2.56 లక్షల మంది రైతులకు రూ. 265 కోట్ల రైతు భరోసా అందించామని, చనిపోయిన రైతు కుటుంబాలకు రూ. 49.96 కోట్ల బీమా చెల్లించామని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా సిలిండర్ల సబ్సిడీ, గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్, కళ్యాణ లక్ష్మి పథకాల ద్వారా వేల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. కొత్తగా 13 వేల రేషన్ కార్డులు మంజూరు చేయడమే కాకుండా, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. మౌలిక వసతుల విషయంలో కొత్తపల్లిహుస్నాబాద్ మరియు హుస్నాబాద్‌అక్కన్నపేట రహదారులను ఫోర్ లేన్లుగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. హుస్నాబాద్‌ను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, అర్బన్ పార్క్ పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. విద్యా రంగంలో భాగంగా ఇంజనీరింగ్ కాలేజీ హాస్టళ్లు, ఏటిసి సెంటర్, న్యాక్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఒంటిమామిడి తరహాలో ఇక్కడ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, చిగురుమామిడిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, వంగరలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వివరించారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, పర్యావరణ పరిరక్షణ కోసం క్లీన్ అండ్ గ్రీన్ హుస్నాబాద్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, సీపీ సాధన రష్మీ పెరుమాళ్ మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్ లే



- **ప్రభుత్వ విప్ లతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ వెలుతురు మే 02::**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్ లే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం MCRHRD లో శాసనసభ, శాసనమండలి విప్ లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను విప్ లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వేసవి నేపథ్యంలో నియోజవర్గాల్లో తాగునీరు, సాగునీటి అవసరాలకు తీసుకోవల్సిన చర్యలు, ధాన్యం సేకరణలో పురోగతి వివరాలను ముఖ్యమంత్రికి తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. విప్ లు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు స్థానిక జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలని, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిస్తుందన్న నమ్మకం ప్రజలకు కల్పించాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడానికి ప్రసార మాధ్యమాలను పయోగించుకోవాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సీఎం సూచించారు. ప్రభుత్వ విప్ లతో సమన్వయం చేసుకునేందుకు, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వారంలో ఒక రోజు విప్ లకు అందుబాటులో ఉంటానని సీఎం తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయరమణరావు, రామచంద్రు నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్ పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కిశోర బాలికల కోసం 'స్నేహ సమ్మర్ క్యాంప్స్' ప్రారంభం

- **హైదరాబాద్ వెలుతురు మే 02:**






రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కిశోర బాలికల కోసం 'స్నేహ సమ్మర్ క్యాంప్స్' ఘనంగా ప్రారంభమయ్యాయి. సెర్ప్ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా అమలు అవుతున్న ఈ సమ్మర్ క్యాంపుల్లో పెద్ద సంఖ్యలో టీనేజ్ బాలికలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మే 2 నుంచి జూన్ 10 వరకు నిర్వహించబడుతున్న ఈ క్యాంపులు కిశోర బాలికల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ప్రత్యేకంగా రూపొందించడం జరిగింది. వివిధ సెషన్ల ద్వారా బాలికలకు ఆరోగ్యం, భద్రత, విద్య, జీవన నైపుణ్యాలు (లైఫ్ స్కిల్స్) పై అవగాహన కల్పిస్తున్నారు.

క్యాంప్‌లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, రక్తహీనత (అనీమియా) వంటి ఆరోగ్య సమస్యలు, గ్రామాలను బాలికలకు సురక్షిత ప్రాంతాలుగా తీర్చిదిద్దే చర్యలు వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. అదేవిధంగా బాలికలు ఎదుర్కొనే వ్యక్తిగత, సామాజిక సవాళ్లను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలపై అవగాహన పెంపొందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ అలవాట్లు, పొదుపు ప్రాముఖ్యత, శారీరక వ్యాయామం, క్రీడలు, యోగా వంటి అంశాలపై కూడా శిక్షణ ఇస్తున్నారు. విద్య ప్రాముఖ్యత, కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాల అభివృద్ధి పై ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తున్నారు. సైబర్ భద్రత, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు, బాలికల స్వతంత్రతను పెంపొందించే కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాల బాలికలకు సైకిల్ తొక్కే శిక్షణ ఇవ్వడం ద్వారా వారి సాధికారతకు దోహదం చేస్తున్నారు.

క్యాంప్ ముగింపు సందర్భంగా తల్లిదండ్రులను ఆహ్వానించి కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించడంతో పాటు, పిల్లల గ్రామ సభ ద్వారా బాల్య వివాహాల నిరోధం, బాలికల భద్రత, విద్య ప్రోత్సాహం వంటి అంశాలపై గ్రామ స్థాయి నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపడుతున్నారు. కీలక శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ స్నేహ సమ్మర్ క్యాంప్స్ ద్వారా కిశోర బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన భవిష్యత్తు నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తున్నారు.

# ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, సమగ్ర వైద్య సేవలను అందించడమేనని రాష్ట ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**అందోల్ వెలుతురు మే 02:**





సినియోజకవర్గ స్థాయి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం అందోల్ జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య మరియు సమగ్ర వైద్య సేవలను అందించడమేనని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య సేవలు అందించే దిశగా ఆధునిక వైద్య సదుపాయాలను విస్తరిస్తున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలందించేందుకు ట్రామా మరియు ఎమర్జెన్సీ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. గతంలో పావలా వడ్డీ పథకం, అనంతరం వడ్డీ లేని రుణాల పథకాన్ని అమలు చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం మహిళలకు ఇందిరమ్మ క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులు వంటి వనరులను కేటాయిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు అందిస్తున్నామని వివరించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం మరియు అవసరమైన అన్ని సౌకర్యాలను అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందోల్ ప్రాంతంలో త్వరలో ఫార్మసీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అందోల్ నియోజకవర్గాన్ని విద్యా కేంద్రంగా (ఎడ్యుకేషన్ హబ్‌గా) అభివృద్ధి చేయడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అలాగే సింగూర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. 200 కోట్ల రూపాయలతో సింగుర్ లైన్ పనులు మొదలయ్యాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ,స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై హర్షం

- **-సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి టీజీవో కృతజ్ఞతలు**

**హైదరాబాద్ వెలుతురు మే 02:**



రాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించిన చర్చలు సఫలీకృతమవ్వడంపై తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) హైదరాబాద్ జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. శనివారం జరిగిన సమావేశంలో ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, ఇతర ప్రభుత్వ పెద్దలకు టీజీవో జిల్లా శాఖ నేతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా టీజీవో నాయకులు ఎం.బి. కృష్ణ యాదవ్, కార్యదర్శి ఏ.ఎం. ఖాదర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల చిరకాల డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన హామీలు ఇవ్వడం శుభపరిణామమన్నారు. చర్చలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర జేఏసీ నాయకులు మార్గం జగదీష్, ఏలూరు శ్రీనివాసరావులకు కూడా వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి. ఆశన్న, ఎం.వి. రమణ, ఇంజులా రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఉద్యోగ ఫ్రెండ్లీగా వ్యవహరిస్తూ తమ సమస్యలను పరిష్కరిస్తుందని వారు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.



క్రిష్ణ యాదవ్ అధ్యక్షులు టీజీవో హైదరాబాద్ జిల్లా

# "సేవే పరమ ధర్మం" స్ఫూర్తితో వైద్యులు సేవలందించాలి

- **ఉస్మానియా మెడికల్ కాలేజ్ 175వ స్నాతకోత్సవ సందేశంలో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా**

హైదరాబాద్, వెలుతురు మే 02, 2026:

వైద్య వృత్తి కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదని, అది మానవాళికి సేవ చేయడానికి తీసుకునే పవిత్ర ప్రతిజ్ఞ అని తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. వైద్యులు జ్ఞానం, సాంకేతిక నైపుణ్యంతో పాటు కరుణ, సానుభూతి వంటి మానవీయ విలువలను అలవరచుకోవాలని సూచించారు. "సేవే పరమ ధర్మం" స్ఫూర్తితో దేశ ప్రజలకు వైద్యులు సేవలందించాలనీ గవర్నర్ సూచించారు.

హైదరాబాద్‌లోని ఉస్మానియా వైద్య కళాశాల 175వ స్నాతకోత్సవానికి శనివారం సాయంత్రం ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.




ఉస్మానియా వైద్య కళాశాల అనేక సంవత్సరాలుగా దేశానికి నిబద్ధతతో, నైపుణ్యంతో కూడిన వైద్యులను అందిస్తున్న గొప్ప వారసత్వ సంస్థగా నిలిచిందని గవర్నర్ కొనియాడారు. పట్టభద్రులైన విద్యార్థులు సాధించిన ఈ విజయానికి వారి కఠోర శ్రమ, అంకితభావమే కారణమని అభినందించారు.

ప్రస్తుత ఆరోగ్య రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో సాంకేతికత, పరిశోధనల ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్న గవర్నర్, ఆధునిక పరికరాలను వినియోగిస్తూనే మానవీయతను మరువకూడదని హితవు పలికారు. రోగికి వైద్యుడిపై ఉన్న నమ్మకమే అతిపెద్ద ఆస్తి అని చెప్పారు.

పట్టభద్రుల కుటుంబ సభ్యులు, అధ్యాపకుల పాత్రను గవర్నర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. వారి త్యాగం, మార్గదర్శకత్వం వల్లే ఈ విద్యార్థులు సమర్థులైన వైద్యులుగా ఎదిగారని పేర్కొన్నారు.

యువ వైద్యులు గ్రామీణ సేవ నుంచి అత్యాధునిక పరిశోధనల వరకు ప్రతి రంగంలోనూ నైతిక విలువలతో సేవ చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

ఉస్మానియా మెడికల్ కాలేజ్ గొప్ప సంప్రదాయాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని కోరుతూ పట్టభద్రులందరికీ ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు.

అంతకుముందు గవర్నర్ వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలు బహుకరించి అభినందించారు.

కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహ, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం దాన కిషోర్, హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ కే రమేష్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ కాలేజీ (DME) శ్రీ నరేందర్ కుమార్, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ రాజా రావు తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



- **వంద రోజుల్లో రూ.6 వేల కోట్ల నిధులు**
- **- సీఎం రేవంత్ రెడ్డి భారీ వరాలు**
- **- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6 వేల కోట్ల విడుదల**
- **- జూన్ 1 నాటికి ఉద్యోగులందరికీ ఆరోగ్య భద్రత కార్డులు**
- **- పీఆర్సీ నివేదిక అందగానే ఫిట్‌మెంట్‌పై ప్రభుత్వం తక్షణ నిర్ణయం**
- **- ప్రతి నెలా 1వ తేదీనే వేతనాల చెల్లింపు - ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం**
- **- వైద్య విధాన పరిషత్‌లోని 13,100 మంది ఉద్యోగుల క్రమబద్ధీకరణ**
- **- రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలతో ప్రభుత్వ సమీక్షా సమావేశాలు**
- **- గందరగోళం లేని టీచర్ల బదిలీలు.. స్వేచ్ఛగా సంఘాల ఎన్నికల నిర్వహణ**
- **- రికార్డు స్థాయిలో 67,760 ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు పూర్తి**

హైదరాబాద్ వెలుతురు మే 02:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల అత్యంత స్పష్టమైన విధానం ఉందని, వారి సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీ, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ప్రతినిధులతో నిర్వహించిన కీలక సమావేశంలో సీఎం పలు సంచలన నిర్ణయాలను ప్రకటించారు. గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిన ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూనే, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం వంద రోజుల్లో రూ. 6 వేల కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పులు, వాటిపై కట్టాల్సిన భారీ వడ్డీల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ, ఉద్యోగుల అవసరాలను తాము విస్మరించలేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించే ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని ఆయన కొనియాడారు. అధికారం చేపట్టిన వెంటనే ఒకటో తారీఖునే జీతాలు ఇవ్వాలనే నిర్ణయాన్ని అమలు చేశామని, ఇది ఉద్యోగుల పట్ల తమకున్న గౌరవానికి నిదర్శనమని చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం విడుదల చేసే రూ. 6 వేల కోట్లను ఏ విధంగా వినియోగించాలనే ప్రాధాన్యతలను ఉద్యోగ సంఘాలే నిర్ణయించుకోవాలని సూచించారు.

ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ (పీఆర్సీ)పై సీఎం సానుకూలంగా స్పందించారు. పీఆర్సీ కమిషన్ నుండి నివేదికను త్వరగా అందజేయాలని ఆదేశించామని, నివేదిక అందిన వెంటనే ఫిట్‌మెంట్‌పై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. అలాగే, జూన్ 1వ తేదీ లోపు రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ అత్యాధునిక ఆరోగ్య భద్రత కార్డులను పంపిణీ చేస్తామని ప్రకటించారు. దీనివల్ల ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలోనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 67,760 పోస్టులను భర్తీ చేసి రికార్డు సృష్టించామని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. గతంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలను ఎటువంటి వివాదాలు లేకుండా, అత్యంత పారదర్శకంగా పూర్తి చేశామని చెప్పారు. ఉద్యోగుల బదిలీల విషయంలో ఎక్కడా గందరగోళం లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ సంఘాలు తమ నాయకులను నామినేటెడ్ పద్ధతిలో కాకుండా, స్వేచ్ఛగా ఎన్నికల ద్వారా ఎన్నుకునేలా ప్రజాస్వామ్య వాతావరణాన్ని కల్పించామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాల పట్ల ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న 13,100 మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని వారు కొనియాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలతో సమావేశమై సమస్యలు వింటామన్న సీఎం హామీపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్న 'ఎంప్లాయీ ఫ్రెండ్లీ' ప్రభుత్వానికి తమ పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా ప్రతినిధులు స్పష్టం చేశారు.



# హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌పై హరీష్ రావు ఆరోపణలు నిరాధారం

- **గ్రామీణ రహదారుల అభివృద్ధిని జీర్ణించు కోలేకే అసత్య ఆరోపణలు చేస్తున్నారు**
- **హరీష్ రావు ఆరోపణలను ఖండించిన మంత్రి సీతక్క**




హైదరాబాద్ వెలుతురు మే 02:

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) రహదారులపై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన ఆరోపణలను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఖండించారు. వాస్తవాలను పక్కనపెట్టి అర్థం లేని విమర్శలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఆవేశానికి లోనుకాకుండా ఆలోచనాత్మకంగా వ్యవహరించాలని హరీష్‌రావుకు సూచించారు. గ్రామీణ రహదారులను జాతీయ రహదారుల స్థాయిలో ఆధునీకరించడం, కొత్త రహదారుల నిర్మాణం చేపట్టడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని జీర్ణించుకోలేకే ఇలాంటి నిరాధార ఆరోపణలు వస్తున్నాయని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తికాకముందే అవినీతి ఆరోపణలు చేయడం విడ్డూరమని మండిపడ్డారు.

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) ను కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ (MoRTH) ప్రవేశపెట్టగా, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) 2016 నుంచి విజయవంతంగా అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 374కు పైగా ప్రాజెక్టులు, సుమారు రూ. 4 నుంచి 5 లక్షల కోట్ల పెట్టుబడులతో ఈ మోడల్ ద్వారా అమలవుతున్నాయి. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల దీర్ఘకాలిక నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తోంది. అందు కోసం గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెరుగుదల లక్ష్యంగా HAM మోడల్ ద్వారా రహదారుల నిర్మాణం చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది.

HAM తొలి దశలో రూ. 6,250 కోట్ల వ్యయంతో 2,162 రహదారులను, మొత్తం 7,450 కిలోమీటర్ల పొడవులో అభివృద్ధి చేయడానికి 17 ప్యాకేజీలుగా పనులు మంజూరు చేశారు. వీటిలో 14 ప్యాకేజీలకు బిడ్లు దాఖలయ్యాయి. మిగతా 3 ప్యాకేజీలకు ఈ నెల 11 వరకు గడువు ఉంది. ప్రస్తుతం సాంకేతిక పరిశీలన పూర్తై, ఆర్థిక బిడ్ల పరిశీలన కొనసాగుతోంది.

ఈ పథకం కింద కాంట్రాక్టర్ సంస్థలు 30 నెలల్లో రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేసి, అనంతరం 15 సంవత్సరాల పాటు నిర్వహణ బాధ్యతలను చేపడతాయి. నిర్మాణ దశలో ప్రాజెక్ట్ వ్యయంలో 40% ప్రభుత్వం చెల్లించగా, మిగిలిన 60% మొత్తాన్ని 15 సంవత్సరాల నిర్వహణ కాలంలో యాన్యుటీ రూపంలో చెల్లిస్తుంది. దీని ద్వారా తక్కువ వ్యయంతో ఎక్కువ రహదారుల నిర్మాణం సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు.

NHAI విధానానికి అనుగుణంగా బ్యాంక్ గ్యారంటీపై గరిష్టంగా 10% మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇవ్వవచ్చు. ఈ అడ్వాన్స్‌ను వడ్డీతో సహా కాంట్రాక్టర్ బిల్లుల నుంచి దశలవారీగా తిరిగి వసూలు చేస్తారు. ఇది కొత్త విధానం కాదని, దేశవ్యాప్తంగా అమలులో ఉందని మంత్రి స్పష్టం చేశారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ తీసుకోవడం కాంట్రాక్టర్‌కు తప్పనిసరి కాదని కూడా తెలిపారు.

ఈ టెండర్లు పూర్తిగా ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, దేశవ్యాప్తంగా ప్రముఖ సంస్థలతో పాటు ఒక అంతర్జాతీయ సంస్థ కూడా పాల్గొన్నట్లు తెలిపారు. అన్ని నిబంధనలు NHAI ప్రమాణాలకు అనుగుణంగా కచ్చితంగా అమలు చేస్తున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు.

వాస్తవాలు ఈ విధంగా ఉన్నప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించేలా నిరాధార ఆరోపణలు చేయడం మానుకుని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని మంత్రి సీతక్క కోరారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని, పారదర్శకతతో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సరికొత్త ప్లాన్

- **- ఘటనా స్థలాల్లో ధ్వంసమైన వాహనాల ప్రదర్శన**
- **- మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు**
- **- డ్రైవర్లను హెచ్చరించేలా చర్యలు**
- **- పోలీసు శాఖ సమన్వయంతో ఏర్పాట్లు**
- **- అవగాహన పెంచి ప్రాణనష్టం తగ్గించడమే లక్ష్యం**




హైదరాబాద్ వెలుతురు మే 2:

రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక వినూత్న ఆలోచనతో ముందుకొచ్చారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, అక్కడ గతంలో ప్రమాదాలకు గురైన ధ్వంసమైన వాహనాలను ప్రత్యేక వేదికలపై ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రవాణా శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్‌కు ఆయన దిశా నిర్దేశం చేశారు. ప్రయాణికులు, డ్రైవర్లు ఆ వాహనాలను చూడటం ద్వారా ప్రమాద తీవ్రతను గ్రహించి, అప్రమత్తంగా వాహనాలు నడిపేలా చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని మంత్రి వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదాలు ఆందోళనకరంగా పెరుగుతున్న నేపథ్యంలో, కేవలం హెచ్చరిక బోర్డులకే పరిమితం కాకుండా ఈ వినూత్న ప్రదర్శనలు డ్రైవర్లలో మానసిక మార్పు తెస్తాయని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రమాదానికి గురైన వాహనాలను హెచ్చరిక సూచికలతో ప్రదర్శించడం వల్ల మలుపులు, ప్రమాదకరమైన కూడళ్ల వద్ద వాహనదారులు వేగాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అమూల్యమైన ప్రజల ప్రాణాలను కాపాడటానికి పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని, తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదకర ప్రదేశాలలో ఈ డిస్‌ప్లేలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

# లోకేశ్ పనితీరు భేష్..!

- పదో తరగతి ఫలితాల్లో సర్కార్ బడుల హవా
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసలు
- విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ పనితీరుపై హర్షం
- రాజకీయాలకు, కుటుంబ వ్యాపారాలకు మధ్య 'గౌరవ ఒప్పందం'
- పిల్లలకు సమయం కేటాయించని తల్లిదండ్రులపై ఆవేదన
- మొబైల్స్, టీవీల వ్యామోహంలో పడిపోతున్న నేటి తరం
- ఆధ్యాత్మికతే మానసిక ప్రశాంతతకు ఏకైక మార్గమన్న వెంకయ్య
- పత్రికల్లో వస్తున్న వార్తలు చూస్తుంటే సిగ్గేస్తోందని వ్యాఖ్యలు
- మంచి పనులు చేసే వారిని ప్రోత్సహించడం అందరి బాధ్యతని వెల్లడి



**నెల్లూరు వెలుతురు మే 02:** ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాలనా శైలిపై భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రశంసల జల్లు కురిపించారు. లోకేశ్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల రాష్ట్ర విద్యావ్యవస్థలో సానుకూల మార్పులు వస్తున్నాయని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరచడం వెనుక ప్రభుత్వ కృషి ఉందన్నారు. శనివారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడిలో పర్యటించిన ఆయన, శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి జీవిత చరిత్ర 'విశ్వంభరుడు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమాజంలోని ప్రస్తుత పరిస్థితులపై తనదైన శైలిలో స్పందించారు.

*లోకేశ్ పనితీరుపై ప్రశంసలు విద్యా ప్రగతి* మంత్రి నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి విద్యాశాఖలో తీసుకువచ్చిన సంస్కరణలు ఫలితాలనిస్తున్నాయని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు సాధించిన విజయమే దీనికి నిదర్శనమన్నారు. విద్యా రంగంలో నాణ్యమైన మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ హయాంలో తాను వివిధ పదవులు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేస్తూ, పాలనలో అంకితభావం ఎంత ముఖ్యమో వివరించారు.

*రాజకీయాలు కుటుంబం: ఒక స్పష్టమైన గీత* తన వ్యక్తిగత మరియు రాజకీయ జీవితం గురించి వెంకయ్యనాయుడు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన రాజకీయాల్లోకి పిల్లలు రాకూడదని, వారి వ్యాపారాల్లో తాను కలగజేసుకోకూడదని తన కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపాలతో ఒక 'గౌరవ ఒప్పందం' చేసుకున్నట్లు తెలిపారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని, కుటుంబ ప్రయోజనాల కంటే సామాజిక బాధ్యతే గొప్పదని ఆయన చాటిచెప్పారు. *తల్లిదండ్రుల బాధ్యత సాంకేతికత దుష్ప్రభావాలు* నేటి కాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు సరైన సమయాన్ని కేటాయించలేకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రస్తుతం అందరూ మొబైల్ ఫోన్లు, టీవీలకే సమయం కేటాయిస్తున్నారు. పిల్లల ఎదుగుదలను గమనించడం లేదు" అని విచారం వ్యక్తం చేశారు. పాశ్చాత్య వ్యామోహం పెరిగి మన సంస్కృతిని విస్మరిస్తున్నామని, దీని వల్ల సమాజం గతితప్పుతోందని పేర్కొన్నారు. పత్రికల్లో వస్తున్న క్రైమ్ వార్తలు, సమాజంలోని వికృత పోకడలను చూస్తుంటే సిగ్గేస్తోందని వ్యాఖ్యానించారు. *ఆధ్యాత్మికతతోనే శాంతి* మానసిక ఉల్లాసానికి, ఆనందానికి ఆధ్యాత్మికత ఒక్కటే సరైన మార్గమని వెంకయ్యనాయుడు అన్నారు. కుటుంబంలో, గ్రామంలో, దేశంలో శాంతి ఉండాలంటే ఆధ్యాత్మిక చింతన అవసరమని సూచించారు. సమాజం దారితప్పినప్పుడే భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి, షిర్డీ సాయిబాబా వంటి మహాత్ములు అవతరించి మార్గదర్శనం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేశ్ రెడ్డి తదితరులు పాల్గొని వెంకయ్యనాయుడు ప్రసంగానికి మద్దతు పలికారు. ప్రజలు మంచి పనులు చేసే నాయకులను గుర్తించి గౌరవించాలని ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు.

## ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు -పరీక్షకు ఫీజు గడువు తేదీని మే 4 వరకు పొడిగింపు






**హైదరాబాద్ వెలుతురు మే 02:**
రాష్ట్రంలో ఇంటర్ అడ్వాన్‌స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు ఫీజు గడువు తేదీని మే 4 వరకు పొడిగించారు. ఇంటర్ మొదటి, రెండో ఏడాది రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులు నాలుగో తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఫీజును చెల్లించి దరఖాస్తులు చేసుకునేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు. అయితే ఆలస్య రుసుము (లేట్ ఫీజు) కింద రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

మే 13 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు : మే 13వ తేదీ నుంచి 21 వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. మే 22వ తేదీ నుంచి 25 వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. రెగ్యులర్ విద్యార్థులతో పైచదువులకు వెళ్లేందుకు వీలుగా ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా త్వరగా నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు సెక్రటరీ యోగితా రాణా ఇటీవలే తెలిపారు. అదేవిధంగా సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపులు ప్రక్రియ ఏప్రిల్ 13 నుంచే మొదలు పెట్టారు. వచ్చే మే 13వ తేదీ నుంచి ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఇంటర్ రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్కు ఏప్రిల్ 13వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

*సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ ఇదే :*
అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లింపు ఏప్రిల్ 13 నుంచి ప్రారంభం
మే 13 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రెండు సెషన్స్లో పరీక్షల నిర్వహణ
మే 22నుంచి 25 వరకు ప్రయోగ పరీక్షలు రెండు సెషన్స్లో ప్రాక్టికల్స్ నిర్వహణ
ఇంటర్ మార్కుల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్కు ఏప్రిల్ 13 నుంచి దరఖాస్తులు
చివరి తేదీ ఏప్రిల్ 20.
ఇంటర్ ఫెయిలైన వారికి ప్రత్యేక తరగతులు
: ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం అడ్వాన్స్డ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యేంత వరకు వరకు ఏప్రిల్ 16 ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఆదర్శ పాఠశాలల టీచర్లను ఆదేశించారు. మే 13వ తేదీ నుంచి ఇంటర్ అడ్వాన్స్డ సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మే 12 వరకు ఫెయిలైన సబ్జెక్టుల్లో ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని కూడా అందిస్తామని నవీన్ నికోలస్ పేర్కొన్నారు.

అయితే సమ్మర్ కావడంతో ఆన్లైన్ క్లాస్ల నిర్వాహణకు అవకాశం కల్పించాలని, తద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు 1020 కి.మీ దూరం నుంచి ఎండలో రాకపోకలు సాగించాల్సినటువంటి అవసరం ఉండదని తెలంగాణ ఆదర్శ పాఠశాలల టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు ఓ ప్రకటనలో ఆయన కోరారు.

ఫస్ట్ ప్లేస్లో మేడ్చల్ జిల్లా : ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో తొలి మూడు జిల్లాలు మేడ్చల్ 77.31, రంగారెడ్డి 76.38 శాతం, జయశంకర్ 73.04 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇక చివరి 3 స్థానాలు కామారెడ్డి 49.40 శాతం, మహబూబాబాద్ జిల్లా 49.11 శాతం, రాజన్న సిరిసిల్ల 49.05 శాతం ఉత్తీర్ణత సాధించాయి. సెకండ్ ఇయర్లో మొదటి మూడు జిల్లాలు వరుసగా మేడ్చల్ 82.73 శాతం, జయశంకర్ భూపాలపల్లి 82.34 శాతం, కుమురం భీం ఆసిఫాబాద్ 82.16 శాతం సాధించాయి. చివరి నుంచి చూసుకుంటే ఆదిలాబాద్ జిల్లా 62.50 శాతం, వరంగల్ 60.80 శాతం, రాజన్న సిరిసిల్ల 58.69 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

## టిఆర్ఎస్ లోకీ మాజీ మంత్రి త్వరలో అనుచరులతో చేరిక..

**హైదరాబాద్ వెలుతురు మే 02:**
టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో మాజీ మంత్రి బోడ జనార్ధన్ భేటీ కావడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశం అనంతరం బోడ జనార్ధన్ మాట్లాడుతూ, తాను త్వరలోనే తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు స్పష్టం చేశారు. ఈ పరిణామం పార్టీ విస్తరణకు దోహదం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా, పార్టీ స్థాపనకు ముందే మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు కవితకు మద్దతు ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. వరుసగా ఇతర పార్టీల నుంచి ప్రముఖ నేతలు చేరుతుండటంతో టీఆర్ఎస్‌లో ఉత్సాహం పెరుగుతోంది. కొత్తగా చేరుతున్న నాయకులతో పార్టీ బలం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మొత్తానికి, కవిత నాయకత్వంలో టీఆర్ఎస్ వేగంగా విస్తరిస్తూ, భవిష్యత్తులో కీలక రాజకీయ శక్తిగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.








Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com